అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి నేడు మంత్రుల రాక

నవతెలంగాణ-మిరుదొడ్డి



అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి ఈనెల 24న మంత్రి కొండ సురేఖ, మంత్రి పొన్నం ప్రభాకర్, కాంగ్రెస్ దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి మిరుదొడ్డి మండలంలో పర్యటించనున్నట్లు సర్పంచ్ కిష్టయ్య కాంగ్రెస్ సీనియర్ నాయకుడు భూమగౌడ్ తెలిపారు. మిరుదొడ్డి మండలం అల్వాల గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయం, కూరగాయల మార్కెట్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రైతు వేదిక, ఎస్సీ కమ్యూనిటీ హాల్ ప్రారంభోత్సవం చేస్తారని తెలిపారు. నూతన భవనాల ప్రారంభోత్సవానికి మంత్రి కొండ సురేఖ రేపు అల్వాల గ్రామానికి రావడం జరుగుతుందన్నారు. కావున దుబ్బాక నియోజకవర్గంలోని కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవ వేడుకల్లో పాల్గొనాలని సూచించారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నవ తెలంగాణ - సిద్దిపేట



సుభాష్ చంద్ర బోస్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి ఎన్ ఎస్ యు ఐ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర కార్యదర్శి కొండలవాడి సతీష్, ఎన్ ఎస్ యు ఐ సిద్దిపేట నియోజకవర్గ అధ్యక్షులు బడికొల్ రాకేష్ యాదవ్, ఎన్ ఎస్ యు ఐ సిద్దిపేట పట్టణ అధ్యక్షులు మొగిలి రాకేష్ ముదిరాజ్, ఎన్ ఎస్ యు ఐ నంగునూర్ మండల అధ్యక్షులు పిల్లి మహేష్, ఎన్ ఎస్ యు ఐ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చేకిల్ల తరుణ్ గౌడ్, ఎన్ ఎస్ యు ఐ నాయకులు సంపత్, సంతోష్, రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధికి సహకరించండి

సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

నవతెలంగాణ - పటాన్ చెరు



పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం సాయంత్రం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సహచర ఎమ్మెల్యేలు సునీతాలక్ష్మారెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాణిక్ రావులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి సీఎం రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పటాన్‌చెరు నియోజకవర్గ అభివృద్ధి కోసం సహకారం అందించాలని ముఖ్యమంత్రిని కోరారు.

మత్స్యశాఖలో అవినీతిని అరికట్టండి

నవతెలంగాణ- మెదక్



మత్స్య శాఖలో జరిగిన అవినీతిని అరికట్టి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మెదక్ కలెక్టరేట్ ఎదుట వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె. మల్లేశం మాట్లాడుతూ.. మత్స్య కార్మిక సహకార సంఘం కార్యాలయంలో పనిచేస్తున్న టైపిస్టు నరేష్, ఏడి నరసింహారావులను గతంలో అవినీతికి పాల్పడినట్లు నిర్ధరణయి సస్పెండ్ కావడం జరిగిందన్నారు. సస్పెండ్ అయిన టైపిస్ట్ నరేష్ తిరిగి విధుల్లో కొనసాగటం పై అనుమానాలు వ్యక్తమవుతున్నట్లు తెలిపారు. 2022 నవంబర్ 14వ తేదీన టైపిస్టు నరేష్ ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారని, మళ్లీ 2023 ఫిబ్రవరి 23న రోజున సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. రెండుసార్లు సస్పెండ్ చేసిన టైపిస్టు మళ్లీ ఉద్యోగంలో కొనసాగడం అనుమానాలకు దారితీస్తుందన్నారు. సస్పెండ్ అయిన ఉద్యోగి ఎవరి ప్రమేయంతో ఉద్యోగంలోకి చేరడాని ప్రశ్నించారు. 38 కుటుంబాలకు నష్టం చేసిన జిల్లా మత్స్య కార్మిక సహకార సంఘానికి నష్టం చేసిన ఉద్యోగిని ఎలా ఉద్యోగంలో పెట్టుకున్నారని నిలదీశారు. 38 కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 6 లక్షల చొప్పున రావలసిన పరిహారం అందలేదని, సస్పెండ్ అయిన ఉద్యోగిని మాత్రం విధుల్లోకి చేర్చుకోవడం దారుణమన్నారు. ఈ నష్టానికి జిల్లా కలెక్టర్ బాధ్యత వహించి ప్రమాదంలో చనిపోయిన 38 కుటుంబాలకు ప్రమాద భీమాపరిహారం చెల్లించాలన్నారు. ఈ సమస్య పై కలెక్టర్ స్పందించకుంటే జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆందోళనను చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యాదమ్మ, పోచమ్మ, విమోచన, సిద్ధమ్మ విజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణా ట్రాక్టర్ పట్టివేత

నవతెలంగాణ-బెజ్జంకి



మండల పరిధిలోని గాగీల్లపూర్ గ్రామ శివారులోని మోయతుమ్మెద వాగు నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్టు ఎస్ఐ నరేందర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టీఎస్ 05 యూసీ 9972 వాహనంపై కేసు నమో దు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

రిపబ్లిక్ డే ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

నవ తెలంగాణ - సిద్దిపేట



75వ రిపబ్లిక్ డే(26 జనవరి) సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జె పాటిల్, పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానాన్ని మంగళవారం పరిశీలించారు. పోలీస్ పెరేడ్, జాతీయ జెండా ఆవిష్కరణ, ప్రోటోకాల్, కల్చరల్ ప్రోగ్రామ్స్, తదితర అంశాల గురించి అధికారులకు తగు సూచనలు, సలహాలు చేశారు. అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ అందె శ్రీనివాసరావు, ఏఆర్ అడిషనల్ డీసీపీలు రామచంద్రరావు, సుభాష్ చంద్రబోస్, డీఈఓ శ్రీనివాస్ రెడ్డి, సిద్దిపేట ఆర్డిఓ రమేష్ బాబు, ఏసీపీ సురేందర్ రెడ్డి, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్, సంపత్ కుమార్, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ ఎస్ఈ మహేష్, ఐఅండ్‌పీఆర్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుపతి నాయక్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కృష్ణారెడ్డి, ఇన్స్పెక్టర్ సురేందర్, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, ధరణి కుమార్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాముల శోభాయాత్రలో ఉద్రిక్తత

నవ తెలంగాణ హత్నూర



అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ట సందర్భంగా దౌల్తాబాద్‌లో ఉత్సవ విగ్రహాలతో సోమవారం సాయంత్రం ఊరేగించారు. దౌల్తాబాద్‌లోని పశువుల ఆస్పటల్ నుంచి శోభాయాత్ర వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి షూ్యా విసిరాడు. అనుమానితిని ఇంటి వద్ద స్థానికులు ఆందోళన చేశారు. అనుమానితుడి పండ్ల దుకాణం తగలబెట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు ఆందోళనకారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో పోలీస్‌బలగాలను భారీ ఎత్తున మోహరించారు. ఆందోళనకారులు ఎంతకీ తగ్గకపోవడంతో ఎస్పీ రూపేష్ కుమార్, డీఎస్పీ పురుషోత్తంరెడ్డి వచ్చి నిందితుడిని అరెస్టు చేస్తామని, న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

ఈ సందర్భంగా దౌల్తాబాద్‌లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ఎక్కడికక్కడ పికెటింగ్ నిర్వహిస్తున్నారు

రెండు రైస్ మిల్స్‌పై క్రిమినల్ కేసు

నవతెలంగాణ హవేలీ ఘనపూర్

రాష్ట్ర ప్రభుత్వం రైతుల నుండి సేకరించిన ధాన్యం రైస్ మిల్లర్లకు సరఫరా చేస్తే కొందరు రైస్‌మిల్లు యజమానులు భారీ అవినీతికి పాల్పడినట్లు రుజువు కావడంతో హవేలీఘనాపూర్ పోలీస్‌స్టేషన్‌లో సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఆనంద్ గౌడ్ తెలిపారు. మండలంలోని వాడి గ్రామానికి చెందిన శారద రైస్ మిల్ యజమాని ఖుర్ల నాగేందర్ 2022-23 సంవత్సరానికి సంబంధించిన ధాన్యం సీఎంఆర్ కింద ప్రభుత్వానికి పంపించకుండా 4.76 లక్షలు, బూరుగుపల్లి గ్రామానికి చెందిన శ్రీ భాగ్యలక్ష్మి రైస్ మిల్ యజమాని వి.సిద్ధిరాములు రూ.రెండు కోట్ల విలువ చేసే సీఎంఆర్ బియ్యం ప్రభుత్వానికి చెల్లించకపోవడంతో జిల్లా పౌరసరఫరాల శాఖ మేనేజర్ హరికృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం సరఫరా చేయడానికి టెండర్లు

నవతెలంగాణ-మిరుదొడ్డి

తెలంగాణ రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో దుబ్బాక నియోజకవర్గంలోని మిరుదొడ్డి పాయింట్ పీడీఎస్ బియ్యం రేషన్ దుకాణాలు, స్కూళ్లకు సరఫరా చేయడానికి టెండర్లు ఆహ్వానించడం జరుగుతుందని గోదాం ఇన్చార్జి తిరుపతిరెడ్డి తెలిపారు. మిరుదొడ్డి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసక్తిగల టెండర్ దారులు ఈనెల 23 నుండి 29 వరకు ఆన్లైన్ ద్వారా టెండర్ దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం టెండర్ వేయదల్చుకున్నవారు 20వేల డిడి చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని టెండర్ దారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

రైతు వేదికలు పడావు

- రూ.9 వేల మెయిటెనెన్స్ నిధులురావట్లే
- తాళాలు తీయరు...రైతు సమావేశాలు జర్గవు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాలైన వైనం
- నీరు గారుతున్న రైతు వేదికల లక్ష్యం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో 319 రైతు వేదికలు
- రూ.70.10 కోట్ల వ్యయంతో నిర్మాణం



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

రైతు వేదికలు పడావు పడ్డాయి. తాళాలు తీసేదిలేదు...రైతు సమావేశాలు జరిగేదిలేదు. దుమ్ముధూళితో నిరుపయోగంగా కొట్టుమిట్టాడుతున్నాయి. రైతుల ప్రయోజనాల కోసం నిర్మించిన రైతు వేదికలు ఉపయోగంలో లేకుండా పోయాయి. నెల నెలా మెయింటెనెన్స్ కోసం ఇవ్వాల్సిన నిధులు రావట్లేదు. ఇంటర్‌నెట్, టీవీ వంటి సదుపాయాల్లేవు. ఏ ఉద్దేశంతో రైతు వేదికల్ని నిర్మించారో అది నెరవేరే పరిస్థితి లేనందున ప్రత్యామ్నాయ అవసరాల కోసమైనా వినియోగించాలనే అభిప్రాయం వస్తుంది. ఊరికి దూరంగా ఉన్న వేదికలు అసాంఘీక కార్యక్రమాలకు, తాగుడుకు అడ్డాలుగా మారాయి.

రైతుల ప్రయోజనాల కోసం ఉమ్మడి మెదక్ జిల్లాలో రైతు వేదికల్ని నిర్మించారు. సంగారెడ్డి, మెదక్, సిద్దిపేట మూడు జిల్లాల్లోని సాగు భూముల విస్తీర్ణం ఆధారంగా క్లస్టర్లను ఏర్పాటు చేశారు. ఐదు వేల ఎకరాలకు ఒక క్లస్టర్‌ను ఏర్పాటు చేశారు. ఒక్కొ క్లస్టర్‌కు పరిధిలో సెంటర్ పాయింట్ చూసి రైతు వేదికను నిర్మించారు. సంగారెడ్డి జిల్లాలో 116 క్లస్టర్లున్నాయి. రైతు వేదికల్ని కూడా 116 నిర్మించారు. సిద్దిపేట జిల్లాలో 127 క్లస్టర్లు ఉండగా ఒక్కొ క్లస్టర్ పరిధిలో ఒక్కొటి చొప్పున 127 రైతు వేదికలున్నాయి. మెదక్ జిల్లాలో 76 కస్టర్లు ఏర్పాటు చేశారు. 76 రైతు వేదికలున్నాయి. మూడు జిల్లాల్లో కలిపి 319 క్లస్టర్లుండగా వాటిన్నిటినూ 319 రైతు వేదికల్ని నిర్మించారు.

రూ.70.10 కోట్ల వ్యయంతో నిర్మాణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో గత ప్రభుత్వం 319 క్లస్టర్ల పరిధిలో రైతు వేదికల్ని నిర్మించింది. ఒక్కొ రైతు వేదిక నిర్మాణం కోసం వ్యవసాయ శాఖ నుంచి రూ.12 లక్షలు, ఉపాధి హామీ నిధుల నుంచి రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.22 లక్షలతో నిర్మించారు. ఒక్కొ రైతు వేదిక కోసం ఐదారు ఎకరాల విస్తీర్ణం చొప్పున భూమిని కేటాయించారు. 319 రైతు వేదికల నిర్మాణం కోసం రూ.70.10 కోట్ల వరకు నిధుల్ని ఖర్చు చేశారు.

నెరవేరని లక్ష్యం

రైతు వేదికల నిర్మాణ లక్ష్యం నెరవేరట్లేదు. గత ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ప్రాధాన్య ఇచ్చింది. ఉచిత విద్యుత్, పెట్టుబడి సాయం వంటివే కాకుండా పంటల సాగులో రైతుల్ని చైతన్య పర్చడం, మార్కెట్, మద్దతు ధరల విషయంలోనూ తోడుగా ఉండాలనే ఉద్దేశంతో వ్యవసాయ పంట సాగు ఆధారంగా క్లస్టర్లను ఏర్పాటు చేసింది. వ్యవసాయ అధికారి, రైతే వేదిక కో-ఆర్డినేటర్ల ద్వారా రైతుల్ని చైతన్య పరిచేందుకు రైతు వేదికలు ఉపయోగపడతాయని బావించారు. రైతు సమన్వయ కమిటీలను ఏర్పాటు చేశారు. వాటి ఆధ్వర్యంలో రైతు వేదికలు నిర్వహించాలని చెప్పారు. రైతులకు లాభసాటి పంట సాగు గురించి అవగహనా కల్పించడం, ఐదు రకాల క్షేత్ర ప్రదర్శనలకు తీసుకెళ్లడం, పచ్చిరొట్ట ఎరువుల వాడకం ద్వారా భూసారం పెరుగుతుందన్న విషయాలు, వరిలో వెదజల్లే పద్ధతి, డ్రమ్ సీడర్ పద్ధతి గురించి అవగహన కల్పించడం, ఎరువుల వాడకంలో జాగ్రతు, సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులు, ప్రకృతి వైపరిత్యాలు, నష్టనివారణ, కంది, సాగు పంటల సాగు పెంపు, వాణిజ్య పంటల సాగు, మార్కెట్ సదుపాయాలు, మద్దతు ధరల వివరాల వంటి విషయాలను చర్చించాలి. రైరతులతో తరచూ సమావేశాలు నిర్వహించారు. నిపుణులైన వ్యవసాయ శాస్త్రవేత్తలు, లాభసాటి వ్యవసాయం చేసే ఆదర్శ రైతులతో మాట్లాడించడం జరగాలి. ఎన్నికలకు ముందే రైతు సమన్వయ సమితులన్నీ రద్దు అయ్యాయి. దీంతో రైతు వేదికల్ని ఉపయోగించడం తగ్గింది. ఎన్నికల తర్వాత ప్రభుత్వం మారడంతో ప్రాధాన్యతలు కూడా మారాయి. దీంతో రైతు వేదికల్లో రైతుల సమావేశాలు జరగట్లేదు. ఏ విషయాలపైనా చర్చించడంలేదు.

అందని మెయింటెనెన్స్ నిధులు

రైతు వేదికల్ని నిర్మించి వదిలేశారు. వాటిని నిర్వహణ కోసం ప్రత్యేకంగా బడ్జెట్ ఇవ్వలేదు. దీంతో గత ప్రభుత్వంలోనే రైతు వేదికల నిర్వహణ కోసం బడ్జెట్ ఇవ్వాలనే డిమాండ్ వచ్చింది. ప్రతి రైతు వేదిక నిర్వహణ కోసం నెలకు రూ.9 వేల చొప్పున మెయింటెనెన్స్ ఖర్చుల కింద నిధులిచ్చేది. రైతు వేదికలో 200 మంది రైతులు సమావేశం జరుపుకునేందుకు వీలుగా నిర్మించారు. ఎఈఓ, రైతు వేదిక కో-ఆర్డినేటర్ కోసం చాంచర్లు, మరుగుదొడ్లు నిర్మాంచారు. ఇంటన్నెట్, టీవీ సదుపాయం కూడా కల్పిస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలోనే నెల నెలా ఇవ్వాల్సిన మెయింటెనెన్స్ నిధులు సరిగ్గా రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం కూడా అట్టి నిధుల్ని విడుదల చేయట్లేదు. దీంతో రైతు వేదికల నిర్వహణ గాలికొదిలేశారు. రైతు వేదికల తాళాలు తీయట్లేదు. రైతుల సమావేశాలు జరగట్లేదు. ఎఈఓ, ఇతర సిబ్బంది కూడా ఇతర పనుల్లో ఉంటున్నారు.

అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాలైన వైనం

చాలా చోట్ల రైతు వేదికల్ని స్థలాలు అందుబాటులో లభించకపోవడంతో ఊరికి ఊరంగా నిర్మించారు. వాటిని ఉపయోగించకపోవడం వల్ల అక్కడ మద్యం తాగడం, ఇతర అసాంఘీక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. కొన్ని చోట్ల పత్తాలాడుతున్నారు. యువకులు మద్యం తాగుతూ సీసాల్ని అక్కడే పడేసి పగలగొడుతున్న పరిస్థితున్నాయి. అకతాయిలకు అడ్డాగా మారాయి.

రైతు వేదికల్ని ఉపయోగంలోకి తేవాలి

రైతుల కోసం నిర్మించిన రైతు వేదికల్ని ఉపయోగంలోకి తేవాలి. గతంలో మాదిరిగా రైతులతో సమావేశాలు జరపాలి. లాభసాటి పంటల సాగు వైపు అవగహన కల్పించాలి. రైతుల సమావేశాలతో పాటు ఇతర ప్రభుత్వ కార్యక్రమాలు, అవగహనా, శిక్షణా కార్యక్రమాలను రైతు వేదికల్లోనే నిర్వహించాలి. పడావు పెట్టడం వల్ల భవనం, పర్నీచర్ చెడిపోయే అవకాశముంది. వాటిని వినియోగించేలా వ్యవసాయ శాఖ జోక్యం చేసుకోవాలి.

- యాదవరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి

ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కల్గించొద్దు

- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ - మెదక్



ఎస్సీ, ఎస్టీల గౌరవానికి భంగం కలిగించొద్దని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన మెదక్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల అట్రాసిటీ చట్టంకు సంబంధించిన విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్సీలు శేరి సుభాష్ రెడ్డి, యాదవరెడ్డిలు హాజరయ్యారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు ప్రవేశపెట్టిన నివేదికలను ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పరిశీలించారు. అనంతరం కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ..ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులు అయిన దళితుల పట్ల పోలీస్ అధికారులు, ఇతర శాఖల అధికారులు సున్నితంగా వ్యవహరించాలని, వారికి వ్యవస్థ పట్ల విశ్వాసం కలిగించేలా అధికారుల పనితీరు ఉండాలని పేర్కొన్నారు. ప్రతి 3 నెలలకు ఒకసారి ఈ కమిటీ సమావేశం నిర్వహించాలన్నారు. అనంతరం ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి మాట్లాడుతూ.. కేసులలో బాధితులకు అందాల్సిన ఆర్థిక పరిహారం సకాలంలో అందించి వారికి సాంత్వన కలిగించేలా చూడాలని సూచించారు. పోలీస్ స్టేషన్ లకు ఇతర సాధారణ కేసులలో వెళ్తున్న ప్రజల పట్ల సైతం పోలీస్ అధికారులు సున్నితంగా, సామరస్యంగా మెదిలేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని, ఎమ్మెల్సీ కోరారు. అనంతరం ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ.. సమాజంలో అందరూ ఒకటే అని, ఎలాంటి వివక్ష లేకుండా సమాజంలో కలసి మెలసి జీవించాలని తెలిపారు. సమావేశం అనంతరం వారి వెంట వచ్చిన పలువురు సర్పంచుల సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ను ఎమ్మెల్సీ శేరి కోరారు. ఈ సమీక్ష సమావేశంలో జిల్లా ఎస్పీ బాల స్వామి, అదనపు కలెక్టర్లు రమేష్, వెంకటేశ్వర్లు, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి విజయలక్ష్మి, సంబంధిత శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, డీఎస్పీలు, విజిలెన్స్ కమిటీ సభ్యులు, తదితర అధికారులు ఉన్నారు.

మీకు సేవ చేయడమే లక్ష్యం

- రాష్ట్ర వెద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

నవతెలంగాణ జోగిపేట





సేవ చేయడమే తన లక్ష్యమని, తొమ్మిదన్నర ఏళ్ల తర్వాత నన్ను గెలిపించి మరోసారి అవకాశం ఇచ్చారని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సీ.దామోదర రాజనర్సింహ అన్నారు. మంగళవారం జోగిపేటలో పలు ప్రైవేటు కార్యక్రమాలకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగిపేట ప్రజల అభివృద్ధి కోసం తన వంతు కృషి ఉంటుందన్నారు. ప్రజలను జీవితంలో ఎప్పుడు మర్చిపోనని స్పష్టం చేశారు.

జోగిపేట గుమాస్తా సంఘం ఆధ్వర్యంలో సన్మానం

జోగిపేట గుమస్తా సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను ఘనంగా సన్మానించారు. సంఘం సభ్యుల కోరిక మేరకు గుమస్తా సంఘానికి వెళ్లారు. సంఘం ఆవరణలో నూతనంగా నిర్మించబోయే పనులకు సహకారం అందించాలని అధ్యక్షులు డాకురి శంకరయ్య మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన సానుకూలంగా స్పందించారు. ఎస్ఎస్‌కే సమాజ్ (పట్కరి) ప్రథమ వార్షికోత్సవ సందర్భంగా మంత్రి ని ఘనంగా సన్మానించారు. ఫ్లోరింగ్, కిచెన్ షెడ్, సీలింగ్, సీసీ రోడ్డు పనులను చేయించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన హామీని ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, కౌన్సిలర్‌లు ఎస్.సురేందర్‌గౌడ్, ఆకుల.చిట్టిబాబు, సుమిత్ర సత్యం, రంగ సురేష్, డి.శంకర్, పి.రేఖ ప్రవీణ్, హరికృష్ణాగౌడ్, కే. నాగరాజ్, చందర్, దుర్గేష్, మాజీ ఎంపీటీసీ డి. వెంకటేశం, గుమస్తా సంఘం అధ్యక్షుడు డాకూరి శంకరయ్య, ప్రధాన కార్యదర్శి మహేష్ యాదవ్, ఉపాధ్యక్షులు ఆకుల నవాజ్, దుర్గయ్య కొశాధికారి నర్సింలు, ఎఎస్‌కే గౌరవ అధ్యక్షులు జగన్నాథం, చందర్, అధ్యక్షుడు నాగరాజ్, ప్రధాన కార్యదర్శి సంతోష్ కుమార్, కొశాధికారి నందు, కాంగ్రెస్ నాయకులు డాకూరి శ్రీనివాస్, శరత్ బాబు, సతీష్, శివ, కృష్ణ, రవి, శ్రీను , రాములు తదితరులు పాల్గొన్నారు.

వీరన్న కుంట కబ్జా చేస్తుండ్రు

- కాపాడాలంటూ రైతుల ఆందోళన
- కంచ తొలగించి నక్షబాట విడవాలి

నవతెలంగాణ-హత్నూర



మండలంలోని వడ్డేపల్లి గ్రామ శివారులో గల వీరన్న కుంట కబ్జా చేస్తుండ్రని, నక్షబాట వీడవకుండా కంచ వేయడాన్ని నిరసిస్తూ వడ్డేపల్లి రైతులు మంగళవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ స్థానికంగా ఉండే కొందరు రోడ్డు వైపు ఆనుకొని ఉన్న భూమితో పాటు నక్షబాటను కలుపుకొని కంచ వేయడంతో మిగతా రైతులు పొలాలకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. సర్వే నంబర్ 457లో వీరన్న కుంటను సుమారు 5 ఎకరాలకుపైగా కబ్జా చేశారని ఆరోపించారు. నక్షబాట విడవకుండా రైతులను తీవ్ర ఇబ్బందులు గురి చేస్తున్న సదరు భూ యజమానురాలపై చర్య తీసుకొని దారి వదలాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై హైకోర్టులో కేసు కూడా వేసినట్లు తెలిపారు. 23న సర్వేకు వస్తున్నామంటూ రైతులకు నోటీసులు ఇచ్చి ఆఫీసర్లు రాకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కావాలని ఆఫీసర్లు సర్వేకు రావడంలేదన్నారు. వీరన్న కుంట కబ్జాకు గురైన పొలానికి నక్ష బాట వదిలేలా ఆఫీసర్లు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ సంధ్యను వివరణ కోరగా సర్వే కోసం నోటీసులు ఇచ్చిన మాట వాస్తవమేనని తెలిపారు. పని ఒత్తిడి వల్ల 29 తేదీకి మార్చడం జరిగిందని తెలిపారు. కబ్జా జరిగిందా? లేదా? సర్వే ద్వారా తెలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను అడ్డుకున్న రైతులు

- టిప్పర్ జేసీబిని పోలీసులకు అప్పగింత
- రూపు మారిన ఎలిగెకాయ చెట్టు కుంట

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)



అక్రమంగా రాత్రి సమయంలో మట్టిని తరలిస్తుండగా రైతులు అడ్డుకుని టిప్పర్‌తో పాటు జేసీబీని పోలీసులకు అప్పగించారు. అడ్డు అదుపు లేకుండా ఇష్టారీతిగా అక్రమార్కులు మట్టిని తవ్వకాలు చేపట్టడంతో 220 కేవి ట్రాన్స్‌కో టవర్ ప్రమాదకరంగా మారింది. అలాగే 11 కేవి విద్యుత్ పోల్ కూడా ఎప్పుడు కిందపడుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. కుంట స్థలాన్ని పరిశీలించిన అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేసిన ఘటన మనోహరాబాద్ మండలం లింగారెడ్డిపేట శివారులో సోమవారం రాత్రి జరిగింది. రైతులు తెలిపిన వివరాల ప్రకారం... లింగారెడ్డిపేట శివారులో ఎలిగెచెట్టు కుంట ఉంది. దానిని ఆనుకుని రైతులు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రైతులు గత నెల రోజుల క్రితం ఇంట్లో వివాహం ఉండడంతో వ్యవసా పొలం వద్దకు రాలేకపోయారు. దీంతో అదే గ్రామానికి చెందిన వ్యాపారి ఎలిగెచెట్టు కుంటలో నుండి పెద్ద ఎత్తున రాత్రి సమయంలో మట్టిని తవ్వి దందా చేస్తున్నారు. అదే కుంటను ఆనుకుని 220 కేవి ట్రాన్స్‌కో టవర్‌ను ట్రాన్స్‌కో అధికారులు ఏర్పాటు చేశారు. ఆ టవర్ నర్సాపూర్ నుండి మీనాజీపేట వరకు వెళ్లే 220 కేవి టవర్ (40)ఉంది. ఈ వ్యాపారి టవర్‌ను కూడా చూడకుండా దగ్గర నుండే మట్టిని తవ్వండంతో అది ప్రమాదకరంగా మారింది. వర్షం కురిస్తే మాత్రం మట్టి కరిగిపోయి టవర్ నేలకొరిగే పరిస్థితి నెలకొంది. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు, విద్యుత్ అధికారులు, ట్రాన్స్‌కో అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని రైతులు వాపోతున్నారు. రైతులు మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవడంతో పరిస్థితిని అధికారులు పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం సాయంత్రం ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్, ఏఈ అనురాధతో పాటు ట్రాన్స్‌కో, రెవెన్యూ, విద్యుత్ అధికారులు మట్టిని తవ్విన కుంటను పరిశీలించారు.. టవర్‌కు ఏర్పడిన ప్రమాదకర పరిస్థితిని గుర్తించి పోలీసుకలు ఫిర్యాదు చేశారు. రైతులు అప్పగించిన టిప్పర్, జేసీబిలు పోలీసుల అదుపులో ఉన్నాయి. ఈ మేరకు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్


నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్



మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. జిల్లాలో గత సంవత్సర కాలంలో జరిగిన నాలుగు మాతృ మరణాలపై జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) గరిమా అగ్రవాల్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జనవరి మాసం నుండి ఎలాంటి మాతృ మరణాలు సంభవించకుండా నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మాతృ మరణాలు సంభవించినప్పుడు డ్యూటీ చేసిన డాక్టర్లు సమీక్ష సమావేశానికి హాజరుకావాలని జిల్లా జనరల్ ఆస్పత్రి సిద్దిపేట, జిల్లా హాస్పిటల్ గజ్వేల్ ఆసుపత్రులలో రేడియాలజిస్ట్ అందుబాటులో ఉండి 24 గంటల స్కానింగ్ సౌకర్యం అందుబాటులో ఉండేట్లు చూసుకోవాలన్నారు. ఇకనుండి ఏమైనా పొరపాటు జరిగినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్. కాశీనాథ్ ,పిఓఎంహెచ్ఎన్ డాక్టర్ రజిని, సిద్దిపేట జిల్లా జనరల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ అరుణ రేఖ ,గజ్వేల్ ఆస్పత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ త్రివేణి, డిప్యూటీ డిఎంహెచ్ వో లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ ప్రభాకర్ డాక్టర్, బ్లడ్ బ్యాంక్ ఇన్చార్జి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ పద్మావతి, ఇన్చార్జి డెమో సత్యనారాయణ, సంబంధిత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సూపర్వైజర్స్, ఆరోగ్య కార్యకర్తలు , ఆశా కార్యకర్తలు మరియు సంబంధిత కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

కిడ్నీ బాధితుడికి ఆర్థిక సహకారం

నవ తెలంగాణ - సిద్దిపేట



సిద్దిపేట పట్టణనికి చెందిన నిరుపేద గట్టు బుచ్చయ్య గ రెండు కిడ్నీలు చెడిపోయి డయాలసిస్ చేస్తున్న సందర్భంగా అనారోగ్యంతో మందులకు, ట్రాన్స్ పోర్ట్ ఖర్చులకు సైతం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న జిల్లా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్య ంలో వైశ్య నాయకుల సహకారంతో రూ.56 వేలు అతనికి అందజేసినట్లు రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శి గంప శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అయిత రత్నకర్, జిల్లా ఆర్య వైశ్య మహాసభ అధ్యక్షులు కాసం నవీన్ కుమార్, కోశాధికారి అత్తెల్లి లక్ష్మయ్య, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి తణుకు ఆంజనేయులు , రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి మాంకాల నాగరాణి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు మాడిషెట్టి హేమలత, అయిత పురుషోత్తం, జిల్లా కార్యదర్శి గంగిశెట్టి శ్రీనివాస్, సిద్దిపేట అర్బన్ డివిజన్ చైర్మెన్ గంప కృష్ణమూర్తి, మార్యాల వాణి, చింత రాజేంద్ర ప్రసాద్, జిల్లా వాసవి సేవాధల్ కార్యదర్శి మార్యాల వీరేశం, వాసవి క్లబ్ అధ్యక్షులు చకిలం రవి, అర్వపల్లి హరి కిరణ్, వైశ్య సంఘం నాయకులు చందా వేణుగోపాల్ పాల్గొన్నారు.

చిట్టిబాబు ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించిన మంత్రి



నవతెలంగాణ-జోగిపేట

అందోల్-జోగిపేట మున్సిపల్ 17వ వార్డు కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో రూపొందించిన 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆవిష్కరించారు. మంగళవారం జోగిపేటకు మంత్రి వచ్చిన నేపథ్యంలో ఆయన చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరింపజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు ఉపయోగపడే క్యాలెండర్‌ను తీసుకువచ్చిన చిట్టి బాబును అభినందించారు. ప్రజల్లో ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ప్రజాప్రతినిధులు ఎప్పుడు ముందు ఉండాలని సూచించారు. మంత్రి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించడం ఎంతో సంతోషంగా ఉందని చిట్టిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు రంగా సురేష్, డాకూరి శంకర్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రవి, రాములు, అనిల్ రాజ్, యాదయ్య, చోటు ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి సీతక్కకు సన్మానం



నవతెలంగాణ-జిన్నారం

తెలంగాణ రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క(అనసూయ)ను ఎంపీడీవోల సంఘం ప్రతినిధులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించినట్టు సంగారెడ్డి జిల్లా ఎంపీడీవో సంఘం మాజీ అధ్యక్షులు ఏ.రాములు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీడీవో రాములు, ఎంపీడీవోల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సత్తయ్య, సంగారెడ్డి జిల్లా ఎంపీడీవోల సంఘం అధ్యక్షులు రవీందర్, సుమతి, బన్సీలాల్, రాష్ట్ర జిల్లా ఎంపీడీవో సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

బార్ అసోసియేషన్ టేబుల్ క్యాలెండర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి అధ్యర్యంలో జిల్లా ప్రధాన నాయమూర్తి ప్రభాకం రావు చేతుల మీదగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు మహేష్, క్రిష్ణ, రాంరెడ్డి, రాంరెడ్డి, శ్రీనివాస్,మానిక్‌రెడ్డి, దయాకర్ రెడ్డి, జూల్ఫాకర్, ఎం.నాగరాజు, అరుణ కుమారి,సతీష్, కె.రాములు, అనురాధ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దీపాదాస్ మున్షిని కలిసిన ఎంపీపీ గిరిధర్‌రెడ్డి



నవతెలంగాణ-జహీరాబాద్

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి దీపా దాస్ మున్షిని పార్టీ జహీరాబాద్ నియోజకవర్గ కో-ఆర్డినేటర్, ఎంపీపీ గిరిధర్ రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర రోడ్లు మరియు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నివాసంలో ఆమెను కలిసినట్టు ఎంపీపీ తెలిపారు. కాగా జహీరాబాద్ నియోజకవర్గంలో జరుగుతున్న పార్టీ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాల గురించి ఎంపీపీని మున్షి అడిగి తెల్సుకున్నారు. జహీరాబాద్ పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకోవాల్సిన చర్యలు, కార్యకర్తల సమన్వయానికి ప్రణాళిక రూపొందించేందుకు పలు సూచనలు చేసినట్టు తెలిసింది. ఈ కార్యక్రమంలో జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఆదర్శం నేతాజీ సుభాష్ చంద్రబోస్



నవతెలంగాణ-సంగారెడ్డి

యువతకు ఆదర్శం అయిన నేత నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఫోరం ఫర్ బెటర్ సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర అన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా నేతాజీ నగర్‌లో గల ఆయన విగ్రహానికి పూలమాలవేసి ఘన నివాళ్లర్పించారు. ఈ కార్యక్రమంలో ఫోరమ్ బెటర్ సంగారెడ్డి ఉపాధ్యక్షుడు సజ్జాద్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మహేష్ కుమార్, సహ కార్యదర్శి గడ్డం పాండు రంగం, కార్యవర్గ సభ్యులు సాయి వరాల, రాము నేతాజీనగర్ సమితి నాయకులురాజేశ్వర్, గంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



జిన్నారం : మండల కేంద్రమైన జిన్నారంలో భారత స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిన్నారం ఎంపీటీసీ కోరబోయిన లావణ్య నరేష్, మాజీ ఎంపీటీసీ పుట్టి భాస్కర్ జిన్నారం గ్రామపంచాయతీ వార్డ్ సభ్యులు శ్రీనివాస్, జిన్నారం మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు నరేందర్ గౌడ్, పలువురు యువ నేతలు, లత, శ్రీనివాస్,ప్రదీప్,పుట్టి సురేష్, ప్రవీణ్, విష్ణుమూర్తి, పల్నాటి భాస్కర్, నీలం రాము తదితరులు పాల్గొన్నారు.

'సిద్దం ఉజ్వల్ రెడ్డి' ఆడియో సాంగ్ రిలీజ్



నవతెలంగాణ-జహీరాబాద్

జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ సిద్దం ఉజ్వల్ రెడ్డిపై అభిమానంతో పార్టీ యువజన నాయకులు అశ్విన్ పాటిల్, అక్షయ్ జాడేలు ఆడియో పాటను గిఫ్ట్‌గా అందించారు. ఆయిదాల సునీల్ రచనలో, చంద్రశేఖర్ ఆజాద్ గానంలో నిర్మించిన ఈ ఆడియో సాంగ్‌ని హైద్రాబాద్‌లోని సిద్దం ఉజ్వల్ రెడ్డి నివాసంలో మంగళవారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తహేర్ పటేల్, జగదీశ్వర్‌రెడ్డి, నతనియేల్, జూబేర్ తదితరులు పాల్గొన్నారు.

బొల్లారం పబ్లిక్ స్కూల్‌లో ఆకట్టుకున్న విద్యార్థుల వేషధారణ



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

మున్సిపల్ పరిధిలోని బొల్లారం పబ్లిక్ హైస్కూల్ ఇంగ్లీష్ మీడియం విద్యార్థులు అయోధ్య బాల రాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా శ్రీరామ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు శ్రీరాముడు, లక్ష్మణుడు, సీతమ్మ, ఆంజనేయస్వామి వేషధారణలో ఆకట్టుకున్నారు. హైస్కూల్ కరస్పాండెంట్ ప్రభు కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జిన్నారం సర్పంచ్ లావణ్య శ్రీనివాస్ రెడ్డి రాజీనామా



నవతెలంగాణ-జిన్నారం

జిన్నారం గ్రామపంచాయతీ సర్పంచ్ అంతిరెడ్డిగారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి తన సర్పంచ్ పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల రీత్యా రాజీనామా చేసినట్టు జిల్లా పంచాయతీ అధికారులకు అందజేసిన రాజీనామా పత్రంలో పేర్కొన్నారు. కాగా మండల కేంద్రమైన జిన్నారంలో కీర్తిశేషులు మాజీ ఎంపీపీ పడకంటి వెంకటేశం గుప్తా విగ్రహావిష్కరణ వివాదాస్పదం కావడం, విగ్రహావిష్కరణ నేపథ్యంలోనే గ్రామపంచాయతీ సెక్రటరీ లక్ష్మీ కాంత్‌రెడ్డికి, జిన్నారం తహసీల్దార్ రవికుమార్‌కు, ఎంపీడీవో రాములుకు, జిన్నారం ఎస్సై విజయరావుకు తదితర అధికార వర్గాలకు కొందరు ఫిర్యాదులు చేయడం, సర్పంచ్ అంతిరెడ్డిగారి లావణ్య శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేయడం లాంటి అంశాలు చకచకా జరిగిపోయాయి. మొత్తం మీద ఈ వ్యవహారం చర్చనీయాంశంగా మారింది.

ఆరుతడి పంటలతో అధిక దిగుబడులు



నవతెలంగాణ-న్యాల్‌కల్

రైతులు వ్యవసాయ శాఖ సూచించిన ఆరుతడి పంటలు సాగు చేసి.. అధిక దిగుబడులు పొందాలని వ్యవసాయ శాఖ ఏడీఏ బిక్షపతి అన్నారు. హద్నూర్ గ్రామంలో ప్రస్తుత యాసంగిలో సాగు అవుతున్న వివిధ పంటలను క్షేత్రస్థాయిలో మంగళవారం పరిశీలించారు. సంగారెడ్డి అనే రైతు సాగు చేస్తున్న శనగ, కుసుమ, అంతర పంట సాగును పరిశీలించారు. పూత వచ్చే దశలో ఉన్న శనగ గింజ గట్టిపడే దశలో నీటి తడులు అధికంగా ఇవ్వాలని రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. పరిశీలించిన వారిలో వ్యవసాయ శాఖ ఏఈవో షరీఫ్, సాయిలు, రైతులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

నవతెలంగాణ-పటాన్‌చెరు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ యువకుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బచ్చుగూడకు చెందిన దయాకర్(23) దినసరి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం మధ్య రాత్రి మండలంలోని ముత్తంగి శివారులో గల ఔటర్ రింగ్ రోడ్డు జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న సమయంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో బలమైన గాయాలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమి త్తం పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సమాచారం తెలియకపోవడంతో మొదట గుర్తుతెలియని మృతిగా కేసు నమోదు చేయగా అనంతరం బచ్చుగూడ వాసిగా కుటుంబ సభ్యులు గుర్తించారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు ఎస్సై సోమేశ్వరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

ప్రభుత్వ భూముల రక్షణకు ఆయా శాఖల అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవెన్యూ, మున్సిపల్, రిజిస్ట్రేషన్స్, పంచాయతీ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, తదితర శాఖల అధికారులతో ప్రభుత్వ భూముల రక్షణ పై కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వ భూములను కాపాడటం అత్యంత ప్రధానమైనదన్నారు. ప్రభుత్వ భూముల రక్షణ ప్రథమ బాధ్యత రెవిన్యూశాఖది అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మున్సిపాల్టీ పరిధిలో గల ప్రభుత్వ భూముల్లో ఎలాంటి ఓపెన్ ప్లాట్స్‌కు, నిర్మాణాలకు ఇంటి నంబర్లు ఇవ్వకూడదని మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. అదేవిధంగా గ్రామపంచాయతీల్లో గల ప్రభుత్వ భూముల్లోనూ అనుమతులు, ఇంటి నంబర్లు ఇవ్వొద్దన్నారు. ప్రభుత్వ ప్రైవేటు భూముల్లో అనుమతులు లేని నిర్మాణాలు జరగొద్దని స్పష్టం చేశారు. అలాంటివి గుర్తించిన ప్రారంభ దశలోనే కూల్చివేయాలన్నారు. ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏ రిజిస్ట్రేషన్ చేసిన ముందుగా ఆయా అనుమతులు పరిశీలించాలని, 22-A రిజిస్టర్ చెక్ చేయాలని, అన్ని డాక్యుమెంట్లను పరిశీలించి, సరిగ్గా ఉన్నప్పుడే రిజిస్ట్రేషన్ చేయాలని రిజిస్ట్రేషన్ శాఖ అధికారులకు సూచించారు. గ్రామ పంచాయతీ గ్రామ కంఠం, నిషేధిత భూములను రిజిస్ట్రేషన్ చేయొద్దన్నారు. ప్రభుత్వ భూముల్లో ఉన్న ఇంటి నంబర్ల వివరాలు అందించాలని మున్సిపల్ కమిషనర్లకు ఆదేశించారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో ఎలాంటి నిర్మాణాలు జరగొద్దని స్పష్టం చేశారు. రికార్డుల్లో ఉన్న ప్రభుత్వ భూమి ప్రభుత్వ భూమిగానే ఉండాలని, రెవిన్యూ రికార్డులలో కరెక్ట్ గా కనిపించాలని, క్షేత్ర పరిధిలో రెవెన్యూ శాఖ ఆధీనంలో ఉండాలన్నారు. తహసీల్దార్ సహకారంతో ప్రతి గ్రామంలో ఉన్న ప్రభుత్వ భూములను, గ్రామం వారిగా సర్వే నెంబర్ వారిగా చెక్ చేసి 10 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని సూచించారు. జిల్లాలో ఎక్కడా ప్రభుత్వ భూములు కబ్జాకు గురికాకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్లు భూముల రిజిస్ట్రేషన్ చేసేటప్పుడు 22-A రిజిస్టర్లో చెక్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రెవిన్యూ అనుబంధ శాఖల అధికారులందరూ ప్రభుత్వ భూముల పరిరక్షణకు కంకణ బదులు కావాలన్నారు. ఈ సమా వేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, హెచ్‌ఎం డిఏ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, నిమ్జ్ డిప్యూటీ కలెక్టర్లు, సబ్ రిజిస్ట్రార్లు, జిల్లా పంచాయతీ అధికారి, ఆర్డీవోలు, నీటిపారుదల శాఖ అధికారులు,తహసీల్దార్లు, ల్యాండ్ సర్వే అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నీటి వనరులను పరిరక్షించాలి..

జిల్లాలోని హెచ్‌ఎండిఏ పరిధిలో గల నీటి వనరులు ఆక్రమణలకు గురికాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో నీటిపారుదల, హెచ్‌ఎండిఏ, మైన్స్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్, పీసీబీ, రెవిన్యూ పంచాయితీ, హెచ్‌ఎండిఏ ఏరియా మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లతో నీటి వనరుల రక్షణ పై కలెక్టర్ మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో హెచ్ ఎండిఏ పరిధిలోగల చెరువులు కుంటలు ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. ఆయా నీటి వనరుల సర్వే పూర్తి చేసి, బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్ తదితరాలతో చెరువు పరిధిని ఫిక్స్ చేసి నోటిఫై చేయాలన్నారు. రెవిన్యూ శాఖ దీనిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎలాంటి తప్పులు జరగరాదని, రెవిన్యూ సర్వే అధికారులు చెరువుల బౌండరీలు సరిగ్గా ఫిక్స్ చేయాలని సూచించారు. తప్పుడు సర్వే జరిగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. చెరువులు, శికం భూములు, కుంటలను కబ్జా కాకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని మిగతా ఏరియాలో ఉన్న చెరువులు ఇరిగేషన్ శాఖ ఆధీనంలో ఉండాలని, మునిసిపల్ ఏరియా చుట్టుపక్కల గల నీటి వనరులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఎఫ్ టి ఎల్ , బఫర్ జోన్ ఫిక్స్ చేసి మ్యాప్స్ తయారు చేయాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, హెచ్‌ఎండిఏ ఈఈ, డీఈలు, నీటిపారుదల శాఖ ఎస్‌ఈ, ఈఈ, ఏడి మైన్స్, డిపిఒ, సంగారెడ్డి ఆర్‌డీఓ, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులు, పిసిబి ఈఈలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా
- జర్నలిస్ట్ డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డి జిల్లాలోని వర్కింగ్ జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా అన్నారు. సంగారెడ్డి జిల్లా వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ రూపొందించిన 2024 నూతన డైరీని మంగళవారం సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని ఆయన స్వగృహంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని, జర్నలిస్ట్ సమస్యల పట్ల సానుకూలంగా ఉన్నదన్నారు. సంగారెడ్డి జిల్లాలోని అర్హులైన జర్నలిస్టులకు త్వరలో ఇండ్ల స్థలాలు అందజేస్తామన్నారు. అనంతరం అసోసియేషన్ అధ్యక్షులు ఎం.సాయినాథ్ ఆధ్వ ర్యంలో కలెక్టరేట్‌లో కలెక్టర్ వల్లూరి క్రాంతికి నూతన సంవ త్సర డైరీను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ.. జర్నలిస్ట్ డైరీలో ఎంతో విలువైన సమాచారం అందించారని, అందుకు అసోసియేషన్ సభ్యులకు అభినం దనలు తెలిపారు. జర్నలిస్టులు ప్రజోపయోగకరమైన అంశా లపై సూచనలు, సలహాలు చేయాలన్నారు. ఈ కార్యక్ర మంలో సంగారెడ్డి వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ అధ్యక్షు లు ఎం.సాయినాథ్, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి నాగ భూషణం, అసోసియేషన్ సభ్యులు ఎర్ర వీరేందర్ గౌడ్, సునీల్, పుండరీకం, రాజేష్, ఆంజనేయులు, నర్సింలు, బక్కప్ప, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ సమస్యలు సృష్టించకండి

- ఇంటెలిజెన్స్ చీఫ్‌కు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఫిర్యాదు



నవతెలంగాణ-పటాన్‌చెరు

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వాలు మారడం సహజమని, రాజ్యాంగబద్ధంగా కల్పించిన ప్రోటోకాల్ హక్కును సైతం ఉల్లంఘిస్తూ ఎలాంటి రాజ్యాంగ పదవులు లేని అధికార పార్టీ నాయకులు అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని, దీని మూలంగా రాజకీయ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని రాష్ట్ర ఇంటెలిజెన్స్ చీఫ్ కు పటాన్‌చెరు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఫిర్యాదు చేశారు. నర్సాపూర్ శాసనసభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి, దుబ్బాక శాసనసభ్యులు కొత్త ప్రభాకర్ రెడ్డి, జహీరాబాద్ శాసనసభ్యులు మాణిక్ రావులతో కలిసి రాష్ట్ర ఇంటలిజెన్స్ చీఫ్ శివధర్ రెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వివిధ అంశాలను ఆయన డిజిపి దృష్టికి తీసుకువచ్చారు. అధికారిక కార్యక్రమాల పర్యటనలో పోలీస్ ఎస్కార్ట్‌ను తొలగించడం, అధికార పార్టీ నుండి పోటీ చేసి ఓడిపోయిన అభ్యర్థి ప్రభుత్వ అధికారిక సమావేశాల్లో ప్రోటోకాల్ కు విరుద్ధంగా పాల్గొనడం, తదితర చర్యల మూలంగా నియోజకవర్గంలో శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని ఫిర్యాదు చేశారు. వెంటనే పై అంశాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని కోరారు.

కోదండరాంను కలిసిన ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులు



నవతెలంగాణ-సంగారెడ్డి

రీజనల్ రింగ్‌రోడ్డు(ఆర్ఆర్ఆర్)లో అధికశాతం భూములు కోల్పోతున్న తమకు న్యాయం చేయాలని కోరుతూ భూ నిర్వాసితులు మంగళవారం తెలంగాణ జన సమితి(టీజేఎస్) అధ్యక్షులు కోదండరాంను కలిసి వినతి పత్రం అందజేశారు. సంగారెడ్డి, చౌటాకూర్ మండలాల మీదుగా వెళ్తున్న ఆర్ఆర్ఆర్‌లో గత ప్రభుత్వం తమ పార్టీ నాయకులకు అనుకూలంగా రోడ్డు అలైన్మెంట్ మార్చ డంతో.. తమ వ్యవసాయ భూములు అధికశాతంలో భూసేకరణకు గురవుతున్నాయని వాపోయారు. దీని మూలంగా తాము ఉపాధి కోల్పోయి కూలీలుగా మారే అవకాశం ఉన్నదని.. న్యాయం చేయాలని కోరుతూ శివంపేటకు చెందిన ఆర్ఆర్ఆర్ భూ నిర్వాసితులు రైతులు ఆంజనేయులు, ప్రతాప్ రెడ్డి, అనంతయ్య, మల్లయ్య, రమేష్, అశోక్ తదితరులు కోదండరాంను కలిసి విన్నవించారు. ఈ కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు తుల్జారెడ్డి, ప్రధాన కార్యదర్శి కుమ్మరి సాయిలు, శ్రీధర్, మహేంద్ర, ప్రభకార్ రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.

కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి



నవతెలంగాణ-పటాన్‌చెరు

నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి రేపటి భావి భారత పౌరులుగా ఎదగండని న్యూ ల్యాండ్ యూనిట్ 2 ప్లాంట్ హెడ్ సురేందర్ అభిలాషించారు. మండలంలోని పాశమైలారం ప్రభుత్వ మండల పరిషత్ ప్రైమరీ స్కూల్‌కు చెందిన 240 మంది విద్యార్థులకు న్యూ ల్యాండ్ యూనిట్ 2 ప్లాంట్ హెడ్ సురేందర్ ఒక్కొక్కరికీ రెండు జతల చొప్పున యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సురేందర్ మాట్లాడుతూ.. గ్రామ ఇన్చార్జ్ సర్పంచ్ మోటే కృష్ణ యాదవ్.. విద్యార్థులకు కావాలిసిన యూనిఫామ్ అందజేయాలని కోరిన వెంటనే యాజమాన్యం స్పందించి యూనిఫామ్ అందజేయడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల్లో కూడా మేటిగా రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎ.సామ్యూల్, హెచ్ఆర్. రఘునాథ్, వార్డ్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రూ.5లక్షలతో డ్రయినేజీ పనులు ప్రారంభం



నవతెలంగాణ-న్యాల్‌కల్

మండల కేంద్రంలో గల బీసీ కాలనీలో జెడ్పీటీసీ నిధుల నుంచి రూ.5 లక్షలతో డ్రయినేజీ పనులను న్యాల్‌కల్ జడ్పీటీసీ స్వప్నభాస్కర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ మాట్లాడుతూ.. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాలను ప్రణాళికబద్ధంగా అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివశంకరయ్య స్వామి, ఉపసర్పంచ్ అబ్దుల్‌ఖాదర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ నాగయ్య, ఖాలాక్ మియా, మెంబర్లు బస్వరాజ్, నర్సిములు, మండల మైనార్టీ నాయకులు మక్సూద్, ఈసం పటేల్, నాయకులు ప్రభు, శ్రీనివాస్, ప్రవీణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

ప్రజా గొంతుక 'నవతెలంగాణ'

- ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి



నవతెలంగాణ-నారాయణఖేడ్‌రూరల్

బడుగు, బలహీన వర్గాల పక్షాన నిలబడుతూ.. ప్రజా గొంతుకై నవతెలంగాణ దినపత్రిక పనిచేస్తున్నదని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లోని ఆయన స్వగృహంలో నవతెలంగాణ 2024 నూతన సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం ఆవిష్క రించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతి దినం అనుస్వరమై.. ప్రతీ అక్షరాన్ని పేద ప్రజల, కార్మిక, కర్షకుల పక్షాన రాస్తున్నదన్నారు.ఈ కార్యక్రమంలో నవతెల ంగాణ మేనేజర్ రేవంత్‌కుమార్, స్టాఫ్‌రిపోర్టర్ కృష్ణ, ఖేడ్ ఇన్‌చార్జ్ అరుణ్, విలేకరులు ప్రవీణ్‌కుమార్, సిద్ధురాం, విశ్వనాథ్, సంగ్రామ్, ప్రవీణ్, కేవీపీఎస్ నాయకులు నర్సిం లు, రమేష్‌చౌహాన్ రవి, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గీతం స్కాలర్ పుష్ప పీహెచ్‌డీ



నవతెలంగాణ-పటాన్‌చెరు

గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లోని మేనేజ్మెంట్ విభాగం పరిశోధక విద్యార్థిని పుష్ప మాచానీని డాక్టరేట్ వరించింది. 'పారిశ్రామికవేత్తల విజయం పై క్లిష్టమైన విజయ కారకాల ప్రభావం: తెలంగాణ రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై ప్రత్యేక అధ్యయనం' చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్‌లోని డాక్టర్ సి.నాగప్రియ, ప్రొఫెసర్ వె.లక్ష్మణ కుమార్స్ మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించారు. మేఘాలయలోని ఐఐఎం షిల్లాంగ్ కు చెందిన ప్రొఫెసర్ నళినీ ప్రవ త్రిపాఠి బాహ్య పరిశీలకుడిగా వ్యవహరించినట్టు తెలిపారు.పుష్ప పరిశోధన తెలంగాణ రాష్ట్రంలోని సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలపై నిర్దిష్ట దృష్టితో పారిశ్రామిక వేత్తల విజయాన్ని ప్రభావితం చేసే క్లిష్టమైన విజయ కారకాలను విశ్లేషించడం లక్ష్యంగా సాగిందన్నారు. 'ప్రభుత్వ అంశం', 'సాంకేతిక అంశం', 'సామాజిక అంశాల' వంటివి చిన్నతరహా సంస్థల పారిశ్రామికవేత్తలను ప్రభావితం చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని ఈ అధ్యయనం గుర్తించినట్టు పేర్కొన్నారు. సూక్ష్మ వ్యవస్థాపకులు 'మేనేజ్ మెంట్ ఫ్యాక్టర్', 'మార్కెట్-సంబంధిత అంశం' పట్ల గణనీయమైన ఆకర్షణను కనబరిచినట్టు తెలిపారు. మధ్య తరహా వ్యవస్థాపకులు 'ఆర్థిక కారకం', 'వ్యక్తిగత కారకం' కోసం ప్రాధాన్యతను ప్రదర్శించారన్నారు. పుష్ప సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం సట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, పలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది సలువురు ఈ సందర్భంగా ఆమెను అభినందించారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



నవతెలంగాణ-సంగారెడ్డి

కేంద్ర బీజేపీ ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఫిబ్రవరి 16న నిర్వహించ తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. సంగారెడ్డిలోని సుందరయ్య భవన్‌లో కార్మిక సంఘాల సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐఎన్టీయూసీ జిల్లా నాయకులు రాజేందర్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ప్రసాద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం వచ్చిన ఈ పదేండ్ల కాలంలో కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ పెట్టుబడిదారులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తున్నదన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఏ రోజూ కేంద్ర ప్రభుత్వం ఆలోచించడం లేదన్నారు. పోరాడి సాధించుకున్న చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్‌ను తెచ్చిందని మండిపడ్డారు. పెట్టుబడిదారులకు అనుకూల నిర్ణయాలు చేస్తూ హక్కుల మీద దాడి చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనాలు పెంచకుండా ధరలు విపరీతంగా పెంచిందన్నారు. ఇప్పటికైనా కనీస వేతనాలు పెంచాలని, కార్మిక వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఫిబ్రవరి 16న జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మిక వర్గం పెద్ద ఎత్తున పాల్గొని మోడీకి గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వెంకట్రాజ్యం, సుందర్, యాదగిరి ,లక్ష్మయ్య ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పర్మిషన్ లేని స్కూల్స్‌పై చర్యలు తీసుకోవాలి



నవతెలంగాణ-సంగారెడ్డి

పటాన్‌చెరు నియోజకవర్గం బీరంగూడలో గల గౌతమ్ మోడల్ స్కూల్, ఇస్నాపూర్‌లో గల మా ప్లే ఇంటర్నేషనల్ స్కూల్స్‌కు అనుమతులు లేవని.. వాటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సూపరింటెండెంట్ సురేఖకి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నల్లవల్లి రమేష్ మాట్లాడుతూ.. బీరంగూడలో గౌతం మోడల్ స్కూల్ గతేడాది ప్రారంభమైందన్నారు. ఆ స్కూల్‌కి ఏడో తరగతి వరకే పర్మిషన్ ఉన్నప్పటికీ 8, 9 తరగతుల వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నారని ఆరోపించారు. రూ.50 వేల నుంచి రూ. 60 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. కనీసం ప్లే గ్రౌండ్ కూడా లేకుండా స్కూల్ నడుపుతున్నారన్నారు. ఇస్నాపూర్‌లో కూడా మా ప్లే ఇంటర్నేషనల్ స్కూల్ పేరుతో ఏడో తరగతి వరకే పర్మిషన్ వచ్చిందని.. కానీ యజమాన్యం తప్పుడు ప్రచారం ఇస్తూ 8,9 పదో తరగతి వరకు పర్మిషన్ ఉందని పేరెంట్స్‌ను నమ్మిస్తూ.. విచ్చలవిడిగా అడ్మిషన్ తీసుకుంటున్నారన్నారు. రూ.58 వేల నుండి 65 వేల వరకు ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. అనమతుల్లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ఆయా పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. లేనియెడల జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు సతీష్, నాయకులు పుండలిక్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ కాలనీని మరింత అభివృద్ధి చేస్తాం



నవతెలంగాణ-ఐడీఏబొల్లారం

బొల్లారం మున్సిపల్ పరిధిలోని వైఎస్సార్ కాలనీని మరింత అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మెన్ కొలను రోజా బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం వైఎస్సార్ కాలనీలో మాజీ జెడ్పీటీసీ కొలను బాల్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కాగా కాలనీలో నీటి కొరత ఉందని ప్రజలు విన్నవించారు. అందుకు స్పందిస్తూ.. త్వరలోనే నీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్ర మంలో కమీషనర్ సంగారెడ్డి, ఏఈ శ్రీకాంత్, ప్రశాంత్, వినోద్, వీరారెడ్డి, రఫు, కాలనీ యూత్ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

నవతెలంగాణ

మెదక్

3

బుధవారం | 24 జనవరి 2024 | www.navatelangana.com

విద్యార్థులకు టై బెల్టుల పంపిణి



నవతెలంగాణ-పాపన్నపేట

విద్యార్థులు ఉన్నత చదువులు చదివి మంచి భవిష్యత్తులో స్థిరపడాలని బాచారం సర్పంచ్ వెంకట రాములు పేర్కొన్నాడు. మంగళవారం బాచారంలోని యుపిఎస్‌లో గ్రామపంచాయతీ సహకారంతో సర్పంచ్ వెంకట రాములు స్వచ్చందంగా విద్యార్థులందరికీ టై, బెల్టుల అందజేశారు ఈ సందర్భంగా సర్పంచ్ విద్యార్థుల ప్రతిభను ప్రశంసించి అభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు చక్కని విద్యను అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జై.సంతోష్ కుమార్ ఉపాధ్యాయులు కే.తోటవ్వ, డి.మమత,, ఉపసర్పంచ్ రామ్ గుప్త, మాజీ ఎంపీపీ పవిత్ర దుర్గయ్య, గ్రామ పెద్దలు గణేష్, రాజు, రమేష్, లక్ష్మీనారాయణ, మల్కయ్య, శ్యాం, రాజు, కిష్టయ్య, కృష్ణ, నారాయణ, మోహన్, అంజి తదితరులుపాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శుల అధ్యక్షుడిగా సంతోష్



నవతెలంగాణ-మెదక్ టౌన్/చేగుంట : మెదక్ జిల్లా తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫెడరేషన్‌కు ప్రత్యక్ష ప్రజాస్వామ్య పద్ధతిలో బ్యాలెట్ ఓటింగ్ ద్వారా ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులుగా కాయితి సంతోష్, ప్రధాన కార్యదర్శిగా పాతూరి రవి, ట్రెజరీగా బి. రాకేష్‌లు ఎన్నికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా కే.ప్రభాకర్ రెడ్డి, లింగప్ప, నవీన్, రజనీకాంత్, సహాయ కార్యదర్శులుగా ప్రవీణ్ రెడ్డి, జితేందర్, రమేష్, నారాయణలను ఎన్నుకున్నారు. జిల్లాలోని మొత్తం 469 గ్రామపంచాయతీలకుగాను 369 పంచాయతీ కార్యదర్శుల సభ్యత్వం కలిగిన బలమైన సంఘానికి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తనపై విశ్వాసం ఉంచి తనను గెలిపించిన జిల్లాలోని ప్రతి పంచాయతీ కార్యదర్శికి అధ్యక్షులు కాయితి సంతోష్ కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శుల ప్రతి సమస్యను పరిష్కరించేందుకు ముందుండి కృషి చేస్తానని తెలిపారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన సేవలు అందించాలి

- సాధారణ ప్రసవాలను పెంచాలి
- నులి పురుగుల నివారణతో పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు
- సిబ్బంది నియామకానికి ప్రపోజల్స్ తయారు చేయాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా



నవతెలంగాణ-మెదక్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో వైద్య అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పిటల్ సేవలు, సిబ్బంది, డెలివరీల గురించి చర్యలు తీసుకోవాలన్నారు. అంబులెన్స్ సేవలు, సాధారణ ప్రసవాలను పెంచాలని తెలిపారు. ఫిబ్రవరి 12న నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని పిల్లలందరికీ ఫిబ్రవరి 12న నులిపురుగుల నివారణ కోసం నివారణ టాబ్లెట్స్ వేయాలని అధికారులను ఆదేశించారు. కమిషనర్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ హైదరాబాద్ ఆదేశానుసారము, ఎనీమియా ముక్త్ భారత్ కార్యక్రమం కింద జిల్లాలో ఎనీమియా ముక్త్ తెలంగాణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. కిశోర వయసు బాలికల్లో రక్తహీనత నివారించి వారిని ఆరోగ్యవంతులుగా చేయటం కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. 24 జనవరి 2024 నుంచి 10 ఏప్రిల్ 2024 వరకు రాష్ట్రీయ బాల్య సురక్ష కార్యక్రమం, మొత్తం 6 టీంల ద్వారా జిల్లాలో ఉన్న 32,850 మంది పిల్లలకు అన్ని ప్రభుత్వ పాఠశాలలు , జూనియర్ కాలేజీలలో 8 నుంచి 12 తరగతుల బాలికలకు యాక్షన్ ప్లాన్ ప్రకారం రక్త పరీక్షలు నిర్వహించి హిమోగ్లోబిన్ తక్కువ ఉన్న పిల్లలందరినీ గుర్తించి వారికి మూడు నెలలపాటు బ్లూ (నీలం) కలర్ ఐరన్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. దీంతో పాటు ఐరన్ ఎక్కువగా ఉన్న ఆహారమైన ఆకుకూరలు, పప్పుధాన్యాలు, బెల్లం, ఖర్జూర పండ్లు, లివర్, దానిమ్మ పండ్లు, గుడ్లు మొదలగు ఆహారాలు ఎక్కువ మొత్తంలో తీసుకోవాలన్నారు. స్కూలుకు వెళ్ళని పిల్లలను గుర్తించి వారిని అంగన్వాడీ కేంద్రంలో నమోదు చేసుకొని వారికి ఐరన్ మాత్రలు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఐరన్ పెరగడానికి తీసుకోవాల్సిన ఆహారం, జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డిఎంహెచ్ఓ చందూ నాయక్, విజయ నిర్మల, మాధురి, ఆలిలా, అరుణశ్రీ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు..

మూర్చతో పొలంలో పడి రైతు మృతి



నవతెలంగాణ-పాపన్నపేట

పొలం పనుల కోసం వెళ్ళి మూర్చ రావడంతో పొలంలో కింద పడి రైతు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని గాజులగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్ఐ సంగన్న కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. గాజులగూడెం గ్రామానికి చెందిన నాయికోటి లక్ష్మయ్య (37) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే లక్ష్మయ్యకు అపుడప్పుడు మూర్చ వస్తుంది. మంగళవారం వ్యవసాయ పనుల్లో భాగంగా భార్యతో కలిసి పొలం వద్దకు వెళ్ళాడు. భార్యకు పనులు చేయమని చెప్పి లక్ష్మయ్య పొలానికి కొంత దూరంలో ఉన్న మరో పొలంలో ఉన్న నీటి పైపు వాల్‌ను ఆఫ్ చేయడానికి వెళ్ళాడు. దీంతో మూర్చ రావడంతో పొలంలోని నీటి కాల్వలో పడి అక్కడిక్కడే మృతి చెందాడు. చాలా సమయం అయినా లక్ష్మయ్య రాకపోవడంతో భార్య కవిత, సమీప పొలాల్లో ఉన్న వారు అనుమానం వచ్చి అక్కడికి వెళ్లి చూడగా లక్ష్మయ్య పొలంలో ఉన్న నీటి కాల్వలో పడి అప్పటికే మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మెదక్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ తెలిపారు.

నార్సింగి మీదుగా దుబ్బాకకు బస్సును నడపాలి



నవతెలంగాణ-నార్సింగి

చిన్న శంకరం పేట్ నుంచి నార్సింగి, సుతారి పల్లి, డీ ధర్మారం, పులిమామిడి మీదుగా దుబ్బాక వరకు ఆర్టీసీ బస్సు నడపాలని టీపీసీసీ సేవాదళ్ ప్రధాన కార్యదర్శి ఈరప్ప యాదగిరి యాదవ్ కోరారు. ఈ రూటు లో బస్సును నడపడం వల్ల వ్యాపారులు, కార్మికులకు ముఖ్యంగా బంగారు భవిష్యత్తు కలిగిన విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. బస్సు సౌకర్యం లేనందు వల్ల వీరికి నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు మైనంపల్లి రోహిత్ రావు, కొత్త ప్రభాకర్ రెడ్డిలు ఈ విషయంలో చొరవ చూపాలన్నారు. తాను కూడా ఈ విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకు వెళతానని, సీఎం ఖచ్చితంగా తమ విజ్ఞప్తిని మన్నించి సమస్యను పరిష్కరిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు, శ్రామికులకు బాసటగా నిలిచే పార్టీ అని యాదగిరి యాదవ్ అన్నారు.

దుర్గామాతను దర్శించుకున్న మాజీ కార్పొరేటర్



నవతెలంగాణ-పాపన్నపేట

ఏడుపాయల వన దుర్గ భవాని మాతను మంగళవారం చింతల్ మాజీ కార్పొరేటర్ వివి సాగర్ రావు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయన వెంట నాయకులు హనుమంతరావు, సీనియర్ అడ్వకేట్ కామ రెడ్డి వేణు, రామ్మోహన్ తదితరులున్నారు.

మెదక్‌లో న్యాయవాదుల క్రికెట్ టోర్నమెంట్



నవతెలంగాణ-మెదక్ టౌన్

మెదక్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం న్యాయవాదులు క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు జన్నారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్రికెట్ మ్యాచ్ ను జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మి శారద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆటలో గెలుపోటములు సహజమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ న్యాయమూర్తి రిటాలాల్ చంద్, స్పెషల్ మొబైల్ కోర్టు మెజిస్ట్రేట్ కల్పన, మెదక్ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీపతిరావు, లైబ్రరీ సెక్రటరీ జనార్దన్ రెడ్డి, న్యాయవాదులు పోచయ్య, ప్రతాపరెడ్డి, పవన్ శ్రీకర్ రావు, మాయ వెంకటేశం, శ్రీనివాస్ రావు, శ్రీనివాస్ గౌడ్, రవి గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

నందగోకుల్ గ్రామంలో గ్రామ సభ



నవతెలంగాణ-నిజాంపేట:

మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ బుర్ర బాల నరసవ్వ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ 9 పంచాయతీ థీమ్స్ గురించి చర్చించారు. 9 థీమ్స్ నుంచి రెండు థీమ్స్ చైల్డ్ ఫ్రెండ్లీ, హెల్త్ పంచాయతీ థీమ్ ఎంచుకోవడం జరిగిందన్నారు. ఈ థీమ్‌లకు గ్రామపంచాయతీ కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సంఘం నిధులలోని 40 శాతం అన్ ట్రైడ్ నిధుల నుంచి 25% నిధులు కేటాయించాలని తీర్మానించి ఆమోదించారన్నారు. మిగిలిన 60 శాతం నిధులు పారిశుధ్యానికి, మంచినీటికి కేటాయించాలని తీర్మానించామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ చంద్రహాస్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు వెంకటేష్, అంగన్వాడి టీచర్ జ్యోతి, మహిళా సంఘాల నాయకురాలు మంగ, ఆశా వర్కర్ పుష్పలత, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రజా ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయం

మోదీ గ్యారెంటీ పథకాలపై ప్రజలకు అవగాహన

బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్



నవతెలంగాణ-మనోహరాబాద్

ప్రజా ఆరోగ్యమే కేంద్ర ప్రభుత్వ ధ్యేయమని ప్రతి ఒక్కరు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేసిన భారత్ వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమాన్ని మున్సిపల్ కమీషనర్ ఖాజా మొయినొద్దిన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి బీజేపి జిల్లా అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్ హజరై మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరు ఉపయోగించుకోవాలని సూచించారు. అనంతరం మున్సిపల్ కమీషనర్ ఖాజా మొయినొద్దిన్ మాట్లాడుతూ మహిళల అభివృద్ధి కోసం తక్కువ వడ్డీతో నాలుగు నుంచి ఐదు లక్షల వరకు రుణాలను అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల వ్యవసాయ, వైద్య, బ్యాంక్ అధికారులు, బీజేపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

యువత నేతాజీని స్పూర్తిగా తీసుకోవాలి









నవతెలంగాణ-పాపన్నపేట

అహింసా వాదంతోనే స్వరాజ్యం సిద్ధిస్తుందని నమ్మి గాంధీజీ, మొదలైన నాయకులందరూ పోరాటం చేస్తుంటే నేతాజీ మాత్రం సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమికొట్టవచ్చని నమ్మి ఆచరణలో పెట్టిన వ్యక్తి అని సర్పంచ్ గురుమూర్తి గౌడ్, ఏఎస్ఐ సంగన్నలు పేర్కొన్నారు. నేతాజీ జయంతిని పురస్కరించుకొని మంగళవారం పాపన్నపేట చౌరస్తాలో ఉన్న సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి గ్రామస్తులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ నేతాజీ ఏర్పాటు చేసిన ఆజాద్ హింద్ పౌజ్‌లో అనేకమంది ముస్లింలు, హిందువులు, సిక్కులు ఉన్నతమైన పదవుల్లో కమాండర్ స్థాయిలో ఉన్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్, సుంకరి సాయిలు, బీకొండ రాములు, నిట్టలాక్షప్ప, గజవాడ రాజేశ్వర్, సుంకరి కృష్ణ, మఠం సతీష్, సుదర్శన్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-మనోహరాబాద్

నేతాజి సుబాష్ చంద్రబోస్‌ను యువతీ యువకులు ఆదర్శంగా తీసుకుని సమాజ శ్రేయస్సుకు పాటుపడాలని బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ నాయకులు మన్నె శ్రీనివాస్‌రావ్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చిన్నలింగ్ మల్లికార్జున్‌గౌడ్‌లు కోరారు. నేతాజి సుబాష్ చంద్రబోస్ 127వ జయంతి ఉత్సవాలను తూప్రాన్ మున్సిపల్ కేంద్రంలో నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసిన దేశ భక్తుడు సుభాష్ చంద్రబోస్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. సుభాష్ చంద్రబోస్‌లాంటి దేశ భక్తులను యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ 15వ వార్డు అధ్యక్షులు బాయికాడి అంజనేయులు, ఎంఆర్‌పీఎస్ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు పల్లెపాటి మాధవి, వెంకట్, రవిచారి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-టేక్మాల్

నేతాజీని నేటి యువత స్పూర్తిగా తీసుకొని ముందుకు పోవాలని బీజేపీ మండల అధ్యక్షులు ఎల్లుపేట రాజు అన్నారు. సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి, పరాక్రమ దివస్ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం టేక్మాల్‌లో నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నేతాజీ దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అధ్యక్షుడు ఎల్లుపేట రాజు, మండల్ ప్రధాన కార్యదర్శి ఎల్లంపల్లి నాగరాజు, వడ్డె రాములు, మండల ఎస్టీ మోర్చా అధ్యక్షులు చౌహాన్ సేనాపతి, సిద్ధిరాములు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -వెల్దుర్తి

మండల పరిధిలో కొప్పులపల్లి గ్రామంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వమించారు. ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు స్థానిక సంఘసంస్కర్త పోచయ్య ఆధ్వర్యంలో గ్రామ చావిడి వద్దకు భారీ ర్యాలీ నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ అమర్‌హై అంటూ ర్యాలీగా బయలుదేరి సుభాష్ చంద్రబోస్ విగ్రహనికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు మాట్లాడారు తొలిగా ఇండియన్ ఆర్మీని తయారు చేశ్యారన్నారు. భారత స్వాతంత్ర సమరయోధుడు ఆజాద్ హింద్ పౌస్ సృష్టికర్త ఎందరికో ఆదర్శంగా నిలిచిన మహా వ్యక్తి అన్నారు. పోచయ్య మాట్లాడుతూ దేశం కోసం అహర్నిశలు కష్టపడి బ్రిటిష్ వారికి ఎదురొడ్డి రక్తాన్ని మీకు ఇస్తా, స్వాతంత్ర్యాన్ని మాకు ఇవ్వండి అంటూ పోరాడిన వ్యక్తి సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని విద్యార్థిని విద్యార్థులు సుభాష్ చంద్రబోస్ బాటలో నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య



నవతెలంగాణ-మనోహరాబాద్


పెట్టిన కమ్యునికేషన్ షాపు సరిగా నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు భరించలేక మనస్థాపానికి గురైన యువకుడు షాపులోనే ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కాళ్ళాకల్‌లో జరిగింది. మృతుడి అన్న తెలిపిన వివరాల ప్రకారం బీహార్ రాష్ట్రం సిరిసి గ్రామానికి చెందిన వినయ్‌కుమార్ మిశ్రా తన ముగ్గురు అన్న దమ్ములతో కలిసి గత 20 సంవత్సరాలుగా మనోహరాబాద్ మండలం పారిశ్రామిక ప్రాంతం కాళ్ళాకల్‌లో పరిశ్రమలలో ఉద్యోగాలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. చిన్న తమ్ముడు మురారి మిశ్రా (25) కాళ్ళాకల్ గ్రామంలో మిశ్రా కమ్యూనికేషన్‌ను ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నట్టు తెలిపారు. కాగా పెట్టిన కమ్యూనికేషన్ షాపు సరిగా నడవకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు తలెత్తాయి. కాగా మురారి మిశ్రా సోమవారం రాత్రి అన్నం తిన్న తరువాత షాపులో పడుకుంటానని చెప్పి వెల్లినట్టు తెలిపారు. కాగా ఉదయం 9 గంటల ప్రాంతంలో పెద్ద అన్న సంతోష్ మిశ్రా దుకాణానికి వెళ్లి చూడగా అప్పటికే మురారి మిశ్రా ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. విషయం తెలపగానే తామంతా అక్కడికి వెళ్లి శవాన్ని కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్టు తెలిపారు. షాపు సరిగా నడవకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులతో మనస్థాపానికి గురై మురారి మిశ్రా ఆత్మహత్యకు పాల్పడినట్టు మృతుడి అన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

27న మెదక్‌లో జాబ్ మేళా

నవతెలంగాణ-మెదక్

జిల్లాలోని యువతీ యువకుల కోసం మెదక్ పట్టణంలోని వైస్రాయ్ గార్డెన్‌లో ఈ నెల 27వ తేది ఉదయం 8 గంటల నుంచి మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు యువజన, క్రీడల అధికారి నాగరాజు మంగళవారం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర యువజన సర్వీసుల శాఖ ఆదేశానుసారం జిల్లా కలెక్టర్ అనుమతితో నిర్వహిస్తున్న ఈ జాబ్‌మేళా కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి 66 కంపెనీల ప్రతినిధులు హాజరవుతున్నారని తెలిపారు. ఈ జాబ్‌మేళాలో సుమారు 4 వేల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. 5వ తరగతి నుంచి పీజీ వరకు విద్యార్హతలు కలిగి 18 నుంచి 30 ఏళ్ల వయస్సు వరకు గల యువకులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నాగరాజు కోరారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-నార్సింగి

మండల పరిధిలోని గ్రామాలైన నర్సంపల్లి, పెద్ద తాండా గ్రామాలలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ కాళేశ్వరానికి సంబంధించిన కాలువల పనులు అసంపూర్తిగా ఉన్నాయని, చేగుంట, నార్సింగి మండలాలతో పాటు నియోజకవర్గంలోని అన్ని మండలాలలో కాలువలను పూర్తి చేయడానికి మంత్రిని కలిసి నివేదించినట్లుగా ప్రభాకర్ రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి మొదటి వారం నుంచి మిగిలిన కాలువలను పూర్తి చేసి కాళేశ్వరం నీళ్లను కాలువల ద్వారా మళ్లించి పంటలు పుష్కలంగా పండే విధంగా కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు. గత మూడు సంవత్సరాలు మెదక్ ఎంపీగా ఉన్నప్పటికీ దుబ్బాక అభివృద్ధి కొరకు ఒక ఎమ్మెల్యేగా పని చేశానని, ఆ అనుభవం తనకు ఇప్పుడు పనికి వస్తుందన్నారు. దుబ్బాకను అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి సిద్ధంగా ఉన్నానని వెల్లడించారు. నర్సంపల్లి గ్రామంలో రూ.4.5 లక్షలతో అంగన్వాడి భవన నిర్మాణం, రూ.17 లక్షలతో పల్లె దవాఖాన, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.5 లక్షలతో మహిళా సంఘ భవనం, రూ.5 లక్షలతో ఎస్సీ కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయగా ఎమ్మెల్యే ప్రభాకర్ రెడ్డి వాటిని ప్రారంభించారు. అనంతరం పెద్ద తండాలో మన ఊరు మనబడి పథకం కింద రూ.23 లక్షలతో పాఠశాల ప్రహరీ, రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.4.5 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను ప్రభాకర్ రెడ్డి ప్రారంభించారు. ఈ స్థానిక జెడ్పీటీసీ బాణాపురం కృష్ణారెడ్డి, సీడీపీఓ స్వరూప, ఎంపీపీ చిందం సబితా రవీందర్, పెద్ద తండా సర్పంచ్ క్షత్రియ నాయక్, నర్సంపల్లి సర్పంచ్ భారతి సత్తయ్య, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మైలారం బాబు, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు మైలారం సత్యనారాయణ, పార్టీ పట్టణ అధ్యక్షుడు విష్ణు వర్ధన్ రెడ్డి, పార్టీ గ్రామ అధ్యక్షులు లాలం, బాషా నాయక్, ప్రధాన కార్యదర్శి అంచనూరి రాజేష్, నార్సింగి సొసైటీ చైర్మన్ శంకర్ గౌడ్, సీనియర్ నాయకుడు శ్రీపతి రావు, ఐకేపీ ఎపీఎం అశోక్, ఐకేపీ సిసి సుల్తానా, రమేష్‌లతో పాటు ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి కారు వెళ్లడంతో వ్యక్తి మృతి



నవతెలంగాణ-కొమురవెల్లి

నిద్రిస్తున్న వ్యక్తిపై నుంచి కారు వెళ్లి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువన్నపేట శివారులో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నాగర్ కర్నూల్ జిల్లా తాండూర్ మండలం శిరసవాడ గ్రామానికి చెందిన పెద్దింటి బలరాం (57) కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం కొమరవెల్లి మల్లన్న దర్శనానికి వచ్చారు. దర్శనం అనంతరం సోమవారం రాత్రి కొండపోచమ్మ ఆలయానికి వెళ్లారు. గురువన్నపేట శివారులో గుడారం ఏర్పాటు చేసుకుని నిద్రిస్తుండగా సుమారు రాత్రి 11:30 నిమిషాలకు టీఎస్ 13ఎఫ్ 8559 నెంబర్ గల కారు నిద్రిస్తున్న బలరాం ఛాతిపై నుంచి వెళ్లడంతో, వెంటనే కుటుంబ సభ్యులు తేరుకొని చూడగా మరణించాడు. మృతుని కుమారుడు పెద్దింటి శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కొమరవెల్లి ఎస్సై నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చిరుత పులి సంచారం ...

ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలి

- డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ నాగరాణి



నవతెలంగాణ-చేగుంట

చేగుంట మండలం ఇబ్రహీంపూర్ సెక్షన్ పరిధిలో చిరుత పులి సంచరిస్తుందని, రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ రేంజ్ అధికారి నాగరాణి హెచ్చరించారు. ఓ ప్రైవేట్ పరిశ్రమల్లో పనిచేస్తున్న ఇబ్రాహీంపూర్ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి సోమవారం సాయంకాల సమయంలో చేగుంట నుంచి బోనాల వెళ్లే దారిలో ఇబ్రహీంపూర్ ఫారెస్ట్ పరిధి నడిరోడ్డుపై పులి కనిపించడంతో అతను వెంటనే అధికారులకు ఫోన్ చేసి విషయాన్ని తెలియజేశాడు. ఇబ్రహీంపూర్, కిష్టాపూర్, డి. ధర్మారం, రుక్మాపూర్, రాంపూర్, కన్యారం, వివిధ ఫారెస్టు ఆమ్లెట్ గ్రామాల రైతులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఫారెస్టు దగ్గర్లో ఉన్న వ్యవసాయ రైతులు కలిసికట్టుగా వెళ్లాలని నాగరాణి సూచించారు. రోడ్డు మార్గంలో నడిచే ప్రయాణికులు రాత్రి వేళలో జాగ్రత్తలు కచ్చితంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటించాలని, వాహనదారులు సైతం జాగ్రత్తగా ఉండాలని ముందస్తుగా హెచ్చరించారు.

పాలమాకుల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ డే



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం పాలమాకుల లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో స్పోర్ట్స్ డేను పురస్కరించుకుని మంగళవారం స్పోర్ట్స్ మీట్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఈఓ తగిరెడ్డి దేశిరెడ్డి పాల్గొని జెండా ఆవిష్కరించారు. రాజగోపాల్‌పేట ఏఎస్ఐ రంగారెడ్డి ఒలింపిక్ ల్యాంప్ వెలిగించారు. పాలమాకుల గ్రామ సర్పంచ్ పంగ కుమార్, ప్రిన్సిపాల్ కె.వర్గీస్, డైరెక్టర్ పభ్బోజు సత్యం క్రీడలను ప్రారంభించారు. మండల విద్యాధికారి దేశిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు క్రీడలు విద్యార్థుల మానసిక ఎదుగుదలకు, ఆరోగ్యానికి, చదువుకు, మానసిక ఉల్లాసానికి ఎంతో ఉపయోగపడతాయని విద్యార్థులు అన్ని రంగాల్లో పాల్గొనాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గట్ల మల్యాల గ్రామసభలో పలు తీర్మానాలు



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలం గట్ల మల్యాలలో సర్పంచ్ తిప్పని రమేష్ అధ్యక్షతన మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. గ్రామ సభలో వివిధ డిపార్ట్మెంట్‌వారీగా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. పలు అభివృద్ధి పనులపై తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి గుగులోతు లలిత, వార్డు మెంబర్ గుడిపల్లి రాధా, టెక్నికల్ అసిస్టెంట్ నాగార్జున్, ఏఈఓ కవిత,హెల్త్ డిపార్ట్మెంట్ సూపర్వైజర్ జయమ్మ, ఏఎన్ఎం సామ్రాజ్యం, ఆశా వర్కర్స్ రేనా, దేవేంద్ర, రాజశ్రీ, సిఏలు రేనా, లక్ష్మి హై స్కూల్ హెడ్మాస్టర్ రమేష్, ప్రైమరీ స్కూల్ హెడ్మాస్టర్ మహేందర్, అంగన్వాడీ టీచర్స్ నిర్మల, రమక్క, పూజిత, గ్రామ నాయకులు గాండ్ల రమేష్, రాజు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి

నవతెలంగాణ-హుస్నాబాద్ రూరల్

సుభాష్ చంద్రబోస్ జయంతిని మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో అన్ని పార్టీల నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ భారత దేశ జాతీయ సైన్యాన్ని ఏర్పరిచి బ్రిటీష్ పై ప్రత్యక్ష పోరాటం చేసిన ఘనత సుభాష్ చంద్రబోస్‌దే నన్నారు. ఇప్పటికీ ఆయన స్థాపించిన ఆర్మీ పేరుతోనే ఇండియా ఆర్మీ పనిచేస్తుందన్నారు. ఇండియా కాంగ్రెస్ అధ్యక్షుడుగా రెండు పర్యాయాలు పనిచేశారని పేర్కొన్నారు. అండమాన్ నికోబార్ దీవులలో ఆయన పేరు మీద ఒక దీవిని ప్రకటించారన్నారు. కేంద్ర ప్రభుత్వం పరాక్రమ దివస్ గా, భారత్ ప్రేమ్ దివస్ గా పిలుస్తుంది కానీ ఆయనకు గుర్తింపుగా పోస్టల్ స్టాంప్ మీద గాని, కరెన్సీ నోట్లపై సుభాష్ చంద్రబోస్ ఫోటోను ముద్రించి గౌరవం ఇవ్వడం లేదన్నారు. గత ప్రభుత్వాలు సుభాష్ చంద్రబోస్ త్యాగాలను రాజకీయ కోణంలోనే చూశాయన్నారు. ఈ పార్టీలకు చిత్తశుద్ధిగా ఉంటే ఐక్యమత్యంగా వచ్చే పార్లమెంటు సమావేశాలలో కనీసం దేశంలో ఒక్క రాష్ట్రానికైనా ఆయన పేరు పెట్టి ఆయన త్యాగాన్ని గుర్తించే అవసరం ఉందన్నారు. అదేవిధంగా హుస్నాబాద్ పట్టణంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ తప్పకుండా ఏర్పాటు చేయాలని అన్ని పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ కన్వీనర్ పచ్చిమట్ల రవీందర్ గౌడ్, బిఎస్పి నియోజకవర్గ ఇన్చార్జ్ ఎలగందుల శంకర్, రైతు సంఘం నాయకులుకవ్వ వేణుగోపాల్ రెడ్డి, కవ్వ రాజిరెడ్డి ,బిసి సంఘం పట్టణ అధ్యక్షులు చొక్కా చారి, బిజెపి నాయకులు పోలోజు రాజేందర్, వెంకటేష్ గౌడ్, బీసీ నాయకులు కోడం ప్రభాకర్,. శరత్, కనకం వెంకట్ తదితరులు పాల్గొన్నారు.





నవతెలంగాణ-గజ్వేల్

నేతాజీ సుభాష్ చంద్రబోస్ అందరికీ ఆదర్శప్రాయుడని యువజన సంఘాల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాతీయ యువజన అవార్డు గ్రహీత దేశబోయిని నర్సింహులు అన్నారు. గజ్వేల్ యువత ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమర యోధుడు, ఆజాద్ హిందు ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ జయంతి పరాక్రమ్ దివస్ సందర్భంగా స్వామి వివేకానంద చౌక్ వద్ద ఆయన చిత్రపటానికి యువజన ప్రతినిధులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. నాకు రక్తాన్ని ఇవ్వండి నేను మీకు స్వాతంత్ర్యాన్ని ఇస్తాను అంటూ స్వాతంత్రం కోసం పోరాడిన భారతదేశ కీర్తి కిరీటం మరణం లేని అమరుడు భారత్‌కు ఆయుధాలతో పోరాడటం తెలుసని ప్రపంచానికి చాటిచెప్పిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. మహోన్నతుడు స్వాతంత్ర్య పోరాటం అహింసా మార్గంలోనే కాదు వీర మార్గంలోనూ బ్రిటీషర్లపై పోరాడుదామని పిలుపిచ్చిన మహావీరుడన్నారు. సాయుధ పోరాటం ద్వారా ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చని నమ్మి ఆచరణలో పెట్టిన యోధుడు సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. ఆయన స్ఫూర్తితో అందరూ ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో యువజన ప్రతినిధులు నాయిని సందీప్, మంతురి నాగరాజు గుంటిపల్లి కుమార్, తాటోజి నర్సింహ్మాచారి, కేతోజీ వినోద్, రమణాకర్, నర్సింహాచారి, విజయ్, శ్రీధర్, రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-నంగునూరు

స్వాతంత్ర్య సమరయోధులు, ఆజాద్ హిందూ ఫౌజ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా మంగళవారం నంగునూరు ఉన్నత పాఠశాలలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గొట్టిపర్తి రామస్వామిగౌడ్ మాట్లాడుతూ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్వాతంత్ర్య సమరంలో పోరాడిన తీరును విద్యార్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకొని దేశ సేవ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-చేర్యాల

నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం చేర్యాల పట్టణ కేంద్రంలోని పంచతంత్ర పాఠశాలలో ఆయన చిత్ర పటానికి పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామల పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శ్యామల సుభాష్ చంద్రబోస్ జీవిత చరిత్ర గూర్చి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయురాళ్లు స్నేహ, అంబిక, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి అందజేత



నవతెలంగాణ-వర్గల్

సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం అనంతగిరిపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గౌరారం గ్రామానికి చెందిన వ్యాపార వేత్త శ్రీకాంత్ రెడ్డి రూ.7 వేల విలువైన క్రీడా సామగ్రిని బహూకరించారు. ముఖ్యఅతిథి వేలూరు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు కృష్ణ సౌజన్య మాట్లాడుతూ ఆటలు ఆడడం వల్ల శారీరక ఆరోగ్యం మెరుగుపడుతుందన్నారు. దీనివల్ల పిల్లలు చదువులో రాణించే అవకాశం ఉంటుందన్నారు. విద్యార్థులకు క్రీడా సామగ్రి బహూకరించిన దాతను అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీతా రాణి, ఎస్ ఎం సి చైర్మన్ తుమ్మల స్వామి, గొడుగు స్వామి, ఉపాధ్యాయ బృందం సంపత్ కుమార్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రాజ్యాంగంపై డీబీఎఫ్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు



నవతెలంగాణ-గజ్వేల్

భారత రాజ్యాంగం గురించి తెలుసుకొని భవిష్యత్తును చక్కదిద్దుకోవాలని మంగళ వారం గజ్వేల్ మండల్ బెజగామా ప్రభుత్వ హై స్కూల్ లో డిబిఎఫ్ ఆద్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల సందర్భంగా డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, జిల్లా ప్రధాన కార్యదర్శి బ్యాగరి వేణు విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత రాజ్యాంగం అమలై 74 సంవత్సరాలవుతున్న సందర్భంగా డీబీఎఫ్ ఆధ్వర్యంలో గజ్వేల్ మండల్ బెజగామా గ్రామంలో ప్రభుత్వ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

ఆటల్లో విద్యార్థిని ప్రతిభ



నవతెలంగాణ-జగదేవపూర్

జగదేవపూర్ మండల పరిధిలోని తిగుల్ గ్రామంలో గల ఉన్నత పాఠశాల విద్యార్థులు గత 20 నుండి 22 వరకు కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన 67వ ఎస్ జి ఎఫ్ అండర్ 14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో ఆడి ఉమ్మడి మెదక్ జిల్లా రెండవ స్థానం సాధించారు. ఈ పోటీలలో 9వ తరగతి చదువుతున్న వంక వెన్నెల ఉత్తమ ప్రతిభ కనబరిచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ నెల 30 నుంచి ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీలో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొననుంది. జాతీయ స్థాయికి ఎంపికైన వంక వెన్నెలను తీగుల్ సర్పంచ్ కప్పర భాను ప్రకాష్ రావు మంగళవారం పాఠశాలలో శాలువా బొకేతో సన్మానించారు. ప్రయాణ ఖర్చులకు ఆర్థిక సహాయం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అనసూయ, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాంగ్రెస్ అనుబంధ సంస్థలకు అండగా ఉంటాం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ అనుబంధ సంస్థలకు ప్రభుత్వం అండగా ఉంటుందని గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే, సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు తూముకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్ పట్టణంలో ఐఎన్టీ యూసీ కాంగ్రెస్ అనుబంధ ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్ క్యాలెండర్‌ను ఆయన ఆవిష్క రించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడే కాకుండా ఎల్లప్పుడు వాటి అనుబంధ సంస్థలకు పార్టీ అండగా ఉంటుందని ఆయన చెప్పారు. ప్రజలకు రైతులకు నిరంతరంగా విద్యుత్తు అందించేందుకు ఐఎన్టియుసి కార్మిక సంఘం కృషి చేయాలని ఆయన కోరారు.

యువత దేశ సమగ్రత కోసం కృషి చేయాలి



నవతెలంగాణ-మర్కూక్

యువత దేశ సమగ్రాభివృద్ధి కోసం కృషి చేయాలని మర్కూక్ ఎంపీపీ తాండ పాండు గౌడ్, జెడ్పీటీసీ యెంబరి మంగమ్మ రామచంద్రం యాదవ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గణేష్‌పల్లి గ్రామంలో స్వాతంత్ర్య సమరయోధులు నేతాజి సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా సర్పంచ్ మెతుకు మంజుల శ్రీరాములు ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువకులు నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయ సాధన కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగడికిష్టాపూర్ సర్పంచ్ దుద్దెడ లక్ష్మీ రాములు గౌడ్, నర్సన్నపేట సర్పంచ్ కానుగంటి మాధవి రాజిరెడ్డి, ఉపసర్పంచ్ మహేష్, ఎర్రవల్లి ఎంపీటీసీ ధనలక్ష్మి కృష్ణ, సారథి ఫౌండేషన్ చైర్మన్ గుడాల శేఖర్ గుప్తా, టీచర్ రామకృష్ణ రెడ్డి, గణేష్‌పల్లి గ్రామ ఉప సర్పంచ్ మహేష్, నాయకులు నర్సింలు, రామరాజు, భీమ్ రాజు, వెంకటేష్, స్వామి, మధు పంతులు, గణేష్ యూత్ సభ్యులు తదితరులున్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండలం శాఖ ఎన్నిక

నవతెలంగాణ-జగదేవపూర్

టీఎస్‌యూటీఎఫ్ జగదేవపూర్ మండల శాఖను మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా టీఎస్ యూటీఫ్ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గజ్వేల్ వెంకట్ కిరణ్ వ్యవహరించారు. అధ్యక్షులుగా ఎం.శివుడు(తీగుల్), ప్రధాన కార్యదర్శిగా పిల్లి రాజనర్సింహ, ఉపాధ్యక్షులుగా జి సమత, లక్ష్మీపతి, కోశాధికారిగా సిహెచ్ రామ చంద్రం, సోషల్ మీడియా కన్వీనర్ జి. ప్రవీణ్ కుమార్, మండల కార్యదర్శులు టి.సుభాషిని, బిక్షపతి, రమేష్, నర్మద బి.రాజేష్, మంజుల, అనిత ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పాల్గొన్న జిల్లా కార్యదర్శి వెంకట్ కిరణ్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ, ఉపాధ్యాయుల సంక్షేమమే ధ్యేయంగా టీఎస్ యుటిఎఫ్ పనిచేస్తుందని అన్నారు. రాష్ట్రంలోనే అగ్రగామి పోరాట సంఘం గా టీఎస్ యూటీఫ్ ఉందని తెలిపారు. 317 జీవో ద్వారా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులను వారి స్థానిక జిల్లాలకు పంపించాలని, స్పౌస్ విషయం ఇంకా పెండింగ్ లో ఉందని, బదిలీలు పదోన్నతులు విషయంలో ప్రభుత్వం చొరవ చూపి న్యాయం జరిపించాలని , అలాగే బదిలీ అయిన స్కూల్ అసిస్టెంట్లను వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ఖాళీ గా ఉన్న పోస్టులను విద్యా వాలంటీర్లను నియమించాలని, డీఎస్సీ ద్వారా ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని అన్నారు. కేజీబీవీ మోడల్ స్కూల్ గురుకుల పాఠశాలలోని పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. నూతనంగా





ఎన్నికైన అధ్యక్షులు

శివుడు గారు మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఉపాధ్యాయులని నియమించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌కు కార్పెట్స్ పంపిణీ



నవతెలంగాణ- గజ్వేల్

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని మల్లన్న సాగర్ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు అవసరమైన కార్పెట్స్, వెయింగ్ మిషన్, మెసర్ మెంట్ టేప్‌లను అందజేశారు. విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి స్థాయిలో స్థిరపడాలని లయన్స్ క్లబ్ నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో స్థానిక పాఠశాల హెడ్మాస్టర్ ఎండి. కరీముద్దీన్, లయన్స్ క్లబ్ కెరీర్ గైడెన్స్ డిస్ట్రిక్ కన్వీనర్ పరమేశ్వర చారి, లయన్స్ క్లబ్ గజ్వేల్ స్నేహ ప్రెసిడెంట్ నేతి శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షబ్బీర్ అలీ నియామకంపై హర్షం



నవతెలంగాణ-గజ్వేల్

కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు, మాజీ మంత్రి షబ్బీర్ అలీని తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (మైనార్టీ ఓబీసీ ఎస్సీ ఎస్టీ సంక్షేమం) నియమించినందుకు మైనార్టీ నాయకులు సర్దార్ ఖాన్, సయ్యద్ మతిన్ కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఇంటిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ షబ్బీర్ అలీ కి సముచిత స్థానం కల్పించినందుకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గేకు, కాంగ్రెస్ అగ్ర నాయకులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీకి గజ్వేల్ మైనార్టీ కాంగ్రెస్ పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. వైయస్సార్ హయంలో షబ్బీర్ అలీ మైనార్టీ సంక్షేమానికి ఎనలేని కృషి చేయడం చేసినట్లు వారు చెప్పారు. ముఖ్యంగా విద్యార్థులకు యువతకు విద్యా ఉపాధి రంగలలో 4% రిజర్వేషన్ ఎంతగానో ఉపయోగపడింది. ఇప్పుడు కూడా రేవంత్ రెడ్డి నాయకత్వంలో మైనార్టీ ఓబీసీ ఎస్సీ ఎస్టీ సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపి వారిని ఆర్థిక రాజకీయాలు రంగాలలో ముందుకు తీసుకోపోతారని వారన్నారు. కార్యక్రమంలోవహీద్, జాకీర్, అజ్గర్, జహంగీర్, సాబేర్, బాబా, జుబ్బేర్, అజహర్, సమీర్, మున్న, ముక్తార్, అడ్డు, రఫీ, ఖాజా తదితులున్నారు.

బ్రహ్మోత్సవాల కరపత్రం ఆవిష్కరణ



నవతెలంగాణ-కొండపాక

మండల పరిధిలోని దుద్దెడలో చారిత్రక శైవ క్షేత్రం స్వయంభూ శంభు లింగేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల కరపత్రాన్ని ఆలయ ప్రాంగణంలో ట్రస్ట్ పాలకమండలి సభ్యుల చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మంచాల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు పెద్దంకుల శ్రీనివాస్ గౌడ్ లు మాట్లాడుతూ...ప్రతి ఏటా అంగరంగ వైభవంగా నిర్వహించే జాతర ఉత్సవాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 5, 6, 7వ తేదీలలో జరిగే వార్షిక బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతర చివరి రోజు 7వ తేదీన శివపార్వతుల కళ్యాణం నిర్వహించిన అనంతరము మహా అన్నప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి గోనె శ్రీనివాస్, ట్రస్ట్ సభ్యులు నగ్రా రాఘవరెడ్డి, నూనె కుమార్ యాదవ్, మంచాల కృష్ణమూర్తి, అమిరిశెట్టి వెంకటేశం, వెంకటరమణ, దేశాయిరెడ్డి, వడ్లకొండ శ్రీనివాస్,కాంగ్రెస్ నాయకులు పంజా అఖిల్, చెరుకు కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

వరిలో బయోగుళికలు వేయకూడదు

నవతెలంగాణ-కొండపాక

వరిలో బయో గుళికలు వేయకూడదని వ్యవసాయశాఖ అధికారి ప్రియదర్శిని రైతులకు సూచించారు. కొందరు రైతులు వరిలో బయోగులికలు వేస్తున్నారని వీటి వల్ల ఎలాంటి లాభం చేకూరాలని పేర్కొన్నారు. ఈ గుళికలు కేవలం పెరుగుదలకు మాత్రమే తోడ్పడతాయని తెలిపారు. మోగి పురుగు, ఆకు చుట్టు పురుగు,సుడిదోమ పై ఎటువంటి ప్రభావం చూపువన్నారు. మన ప్రాంతంలో ఈ మోగీ పురుగు పెరగడానికి ప్రధాన కారణం రైతులు ఈ గుళికలను 3 జీ గుళికలు , 4 జి గుళికలు అని భావించి వేస్తున్నారన్నారు. రైతులు ఈ గుళికలను వేయరాదని తెలిపారు. కొందరు ఊర్లలో తిరుగుతూ బయోగులికలను అమ్ముతున్నారని ఇలా అమ్మడం చట్టరీత్యా నేరమన్నారు. కేవలం అధికృత షాపుల ద్వారా మాత్రమే అమ్ముకోవాలి.ఆ గుళికలు ఎందుకు పనిచేయవు కేవలం మొక్క పచ్చబడడానికి మాత్రమే తోడ్పడతాయి. ఇటువంటి వాళ్ళు ఎవరైనా వస్తున్నట్లయితే వ్యవసాయ అధికారి కి , వ్యవసాయ విస్తరణ అధికారి కి సమాచారం ఇవ్వాలని తెలిపారు రైతులకు సూచించారు.


బైండ్ల సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక



నవతెలంగాణ - చిన్నకోడూరు

బైండ్ల భవనయ సంఘం సిద్దిపేట జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రముఖ పుణ్యక్షేత్రం కొమురవెల్లి మల్లన్నస్వామి దేవస్థానం ఆవరణలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏదుల్ల గౌరీశంకర్ బైండ్ల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరుపుల భాస్కర్ బైండ్ల తెలిపారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ బైండ్ల జాతి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. బైండ్ల కులస్తుల సమస్యలపై పోరాడుతామన్నారు. బైండ్లలకులస్తుల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిట్టపల్లి గణేష్ , రాష్ట్ర కార్యదర్శి ఉప్పునూతల నర్సింగరావు బైండ్ల కుల బాంధవులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గౌరవ సలహాదారులుగా మిట్టపల్లి రాజయ్య, బచ్చుల నరసయ్య, ఉపాధ్యక్షులుగా మిట్టపల్లి సుధాకర్, ఉప్పునూతల పరశురాములు, వేముగంటి కుమారస్వామి, సంయుక్త కార్యదర్శులుగా ఉప్ప నూతల ప్రశాంత్, దుబ్బాసి రజనీకాంత్, మిట్టపల్లి ప్రసాద్, బచ్చుల శంకర్, వేముగంటి రాజు, కోశాధికారి మిట్టపల్లి రాంబాబు, సహాయ కార్యదర్శులుగా బచ్చలి బిక్షపతి, ఉప్పునూతల బాలకృష్ణ, దుబ్బాసి రాజు, దబ్బేట రమేష్ , వేముగంటి వెంకటేష్, దుబ్బాసి రమేష్, కార్యవర్గ సభ్యులుగా వేముగంటి శ్రీను ,దుబ్బాసి సాయిలు, మిట్టపల్లి నరసయ్య, వేముగంటి సాయి శంకర్, మిట్టపల్లి రవి, బచ్చలి అంజి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో బైండ్ల సంఘం కుల పెద్ద మనుషులు పాల్గొన్నారు.

కే సక్సెస్ కార్యక్రమం నిర్వహణ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం సత్యసాయి సేవా సంస్థలు గజ్వేల్ బూర్గుపల్లి వారి ఆధ్వర్యంలో మంగళవారం వ్యక్తిత్వ వికాసం నిపుణులు శ్రీ మల్లేష్ గజ్వేల్‌లోని లక్ష్మణ్ గార్డెన్ వేదికగా కే సక్సెస్ కార్యక్రమం నిర్వహించారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షులు నర్సింలు, మండల విద్యాధికారి సునీత గజ్వేల్ మండలం నోడల్ అధికారి శ్రీ వై కృష్ణ, రాష్ట్ర పూర్వ బాలవికాస్ ఇన్చార్జ్ వై సుఖేందర్ , రాష్ట్ర గ్రామ సేవ మహా యజ్ఞం మెంబర్ వెంకట నరసింహారెడ్డి, సత్యసాయి సేవాసమితి గజ్వేల్ కన్వీనర్ వెంకటేషం , శ్రీ సత్యసాయి సేవా సమితి బూర్గు పల్లి కన్వీనర్ బాల నర్సయ్య , తలకొక్కుల లక్ష్మణ్ వై మహేష్, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

యువతను ప్రోత్సహిస్తున్న మోడీ



నవతెలంగాణ-గజ్వేల్

ప్రధాని శ్రీ నరేంద్రమోడీ 25న దేశ వ్యాప్తంగా 50 లక్షల మంది యువ నూతన ఓటర్లతో సంభాషిస్తారని బీజేవైఎం సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షులు దేవులపల్లి మనోహర్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నమో నవ్ మత్ దాత సమ్మేళన్‌లో నమోదు చేసుకోవడానికి కృషి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. గజ్వెల్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులతో 7820078200 కి మిస్డ్ కాల్ తో ఇప్పిస్తూ రిజిస్ట్రేషన్ చేపిస్తూ నూతన యువ ఓటర్లను నరేంద్ర మోడీ ప్రోత్సహిస్తున్నారని ఆయన అన్నారు. 25న సంభాషణలో దేశానికి బలమైన దేశ యువత నేడు నరేంద్ర మోదీ సారథ్యంలో అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్న అద్భుత ఘట్టానికి సాక్ష్యంగా నిలుస్తుంది అన్నారు. యువత ఆశలకు, ఆశయాలకు అనుగుణంగా మోదీ సర్కారు ముందుకు సాగుతుంది అన్నారు. వివిధ రంగాల్లో అద్భుతమైన మైలురాళ్లను అధిగమిస్తూ యువతకు బంగారు భవిష్యత్తుకు మోదీ గ్యారెంటీనిస్తున్నారు. ప్రతి ఒక్క నూతన ఓటరు తన ఓటుతో ప్రతిధ్వనించాలి యువకులు పెద్ద ఎత్తున నరేంద్ర మోదీ కి మద్దతు పలకాలన్నారు. కార్యక్రమంలో బిజెపి నాయకులు నత్తి శివకుమార్, బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మఠం మహిపాల్ యాదవ్, బీజేవైఎం అసెంబ్లీ కన్వీనర్ మన్నే శేఖర్, బీజేవైఎం గజ్వెల్ పట్టణ అధ్యక్షులు ఆర్కే యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తొగుటలో జిల్లా ఇంచార్జి మంత్రి పర్యటన



నవతెలంగాణ-తొగుట

నేడు మండల కేంద్రంలో జిల్లా ఇంచార్జి మంత్రి, కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి పర్యటించనున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అక్కం స్వామి తెలిపారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ బుధవారం మధ్యాహ్నం మండల కేంద్రంలో జిల్లా ఇంఛార్జి మంత్రి కొండా సురేఖ, దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ ఇంఛార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పర్యటించనున్నారని అన్నారు. తొగుట గ్రామ పంచా యతీ కార్యాలయం, రైతు వేదిక, కేజీబీవీ విద్యాల యం నూతన భవనం, వాటర్ ట్యాంక్, జిల్లా పరి షత్ ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ ప్రారంభోత్స వం చేయనున్నరని తెలిపారు. అనంతరం మల్లన్న సాగర్ నుండి ఎల్లారెడ్డిపేట కాలువ ద్వారా నీటి విడుదల కార్యక్రమం ఉందని తెలిపారు. మండలం లోని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మిత్రు లు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవం తం చేయాలని కోరారు.

నవతెలంగాణ

5

మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

బుధవారం | 24 జనవరి 2024 | www.navatelangana.com

మండల అధ్యక్షుడిగా ఎన్నిక కావడంపై హర్షం



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రానికి చెందిన సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఇటీవల రెడ్డి సంఘం మండల అధ్యక్షుడిగా నియామకం కావడం పట్ల మంగళవారం మండల కాంగ్రెస్ నాయకులు ఆయనను శాలువాతో సత్కరించి హర్షం వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ రానున్న రోజులలో ఇలాంటి మరిన్ని ఉన్నతపదవులు ఎన్నో పొందాలని వారు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొరిట్యాల లక్ష్మణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చింతకింది శంకర్, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండీ అంకూస్, బోయిని అశోక్, కార్యదర్శి వేల్పుల వెంకటస్వామి, నాయకులు ముంజ ప్రకాష్, వార్డు సభ్యుడు గాజుల రవీందర్, మల్యాల శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖల అధ్యక్షులు పోలు శ్రీనివాస్, గూడ స్వామి, రాగుల శ్రీనివాస్, చుక్క అశోక్, తూటి రాజిరెడ్డి, జయకృష్ణ, నంగునూరి శ్రీనివాస్, భైరి సుధాకర్, పడిగల చెన్నారెడ్డి, కరివేద చంద్రారెడ్డి, గుండ రమేష్, బండి రవి, సది, బాలయ్య, వట్టిపల్లి లింగారెడ్డి, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల కొరత

- ఎస్ఎస్‌సీ 100 శాతం ఉత్తీర్ణత ఎలా?
- జిల్లావ్యాప్తంగా 550 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ
- ఉన్న ఉపాధ్యాయులపై భారం
- విద్యా వలంటీర్ల నియామకానికిలేని అవకాశం
- ఖాళీల భర్తీకి ప్రభుత్వం దృష్టి సారించాలి



నవతెలంగాణ-సిద్దిపేట

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలో విద్యాబోధనకు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తున్నది. సరిపడే ఉపాధ్యాయులు లేక.. ఉన్న ఉపాధ్యాయులపై విద్యాబోధన భారం పడుతున్నది. దీంతో ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులు తాము తీసుకోవాల్సిన తరగతుల కంటే అధికంగా క్లాసులు తీసుకుంటూ ఒత్తిడికి గురవుతున్నామని, విద్యార్థులకు సరైన న్యాయం చేయలేకపోతున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ఖాళీల భర్తీని విద్యా వలంటీర్ల ద్వారా నియమించుకోవడానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సూచనలు లేకపోవడంతో ఖాళీ పోస్టులను భర్తీ చేయలేకపోతున్నామని, దీనివల్ల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఉపాధ్యాయుల కొరత మూలంగా పదవ తరగతి ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించాలంటే ఉన్న ఉపాధ్యాయులపై అధిక భారం పడుతుందని, వారు సహకరించకుంటే 100 శాతం ఉత్తీర్ణత సాధించడం కష్టమేనని విద్యావేత్తలు చెబుతున్నారు. ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేస్తే అనుకున్న విధంగా ఫలితాలు సాధించవచ్చని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నాయి. ఏది ఏమైనా ఖాళీల మూలంగా విద్యార్థులకు నాణ్యమైన, న్యాయమైన విద్య అందడం లేదని చెప్పొచ్చు.

550 ఉపాధ్యాయుల పోస్టుల ఖాళీలు

సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా 976 ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలలో 550 పోస్టులు కాళీ ఉన్నాయి. సుమారుగా ఇందులో 260 కి పైగా ఉన్నత పాఠశాలలో బోధించే ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

వలంటీర్ల నియామకానికం లేక ఇబ్బందులు

జిల్లావ్యాప్తంగా అనేక పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. వివిధ గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉంటే అక్కడ పార్ట్ టైం టీచర్లను నియమించుకోవడానికి ప్రభుత్వం అవకాశమిచ్చింది. దీంతో అక్కడ ఉపాధ్యాయుల కొరత ఉండదు. గత ప్రభుత్వం విద్యా వలంటీర్ల వ్యవస్థను తొలగించడంతో ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతున్న వలంటీర్లు లేక విద్యాబోధనకు ఉపాధ్యాయులు, విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ ప్రభుత్వమైనా ఉపాధ్యాయుల ఖాళీలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో విద్యా వలంటీర్లకైనా అవకాశం ఇవ్వాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

సిద్దిపేట పట్టణంలోని ప్రభుత్వ బాలికల పాఠశాలకు 37 మంది ఉపాధ్యాయుల పోస్టులు మంజూరు ఉండగా, ప్రస్తుతం అక్కడ 9 ఖాళీలు ఉన్నాయి. స్కూల్ అసిస్టెంట్లకు చెందిన ఒక తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజికల్ సైన్స్, ఉర్దూ, మూడు సోషల్ పోస్టులతో పాటు ఒక ఉర్దూ ఎస్‌జీటీ పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ 6 నుండి 10వ తరగతి వరకు 663 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ మీడియాలలో విద్యార్థులు చదువుకుంటున్నారు. కానీ ఉర్దూ మీడియం లో ఉపాధ్యాయుల కొరత మూలంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పదవ తరగతి విద్యార్థులకు 6 సబ్జెక్టులు ఉండగా, బయో సైన్స్, సోషల్ ఇద్దరు మాత్రమే రెగ్యులర్ ఉర్దూ మీడియం ఉపాధ్యాయులు ఉన్నారు, దీంతో తెలుగు, ఇంగ్లీష్ మీడియాలకు చెందిన ఉపాధ్యాయులతో మిగతా సబ్జెక్టు కు విద్య బోధన చేయిస్తున్నారు. ఇలా అనేక పాఠశాలలో ఎస్జీటీలతో కానీ, ఉన్న ఉపాధ్యాయులకు అధిక పని భారంతో విద్య బోధన చేయిస్తున్నారు. ప్రభుత్వం ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేసి, ప్రభుత్వ విద్యారంగాన్ని ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు, వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

ఒకసారూ.. రెండు సబ్జెక్టుల బోధన



మాకు జాఫర్ ఖాన్ సారే గణితంతో పాటు ఫిజిక్స్ కూడా బోధిస్తున్నారు. ఇంగ్లీష్ క్లాస్ కోసం తెలుగు మీడియం విద్యార్థులతో కూర్చుండి వినాల్సి వస్తుంది. ఉర్దూ మీడియం తరగతులు చెప్పడానికి ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే రెగ్యులర్‌గా ఉన్నారు. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయులందరినీ నియమిస్తే మంచి మార్కులు తెచ్చుకొని సిద్దిపేటకు పేరు తీసుకొస్తాం.

– హాఫ్జ జరిన్, ఉర్దూ మీడియం, పదో తరగతి విద్యార్థిని, సిద్దిపేట.

బాల్ బ్యాడ్మింటన్‌లో విద్యార్థికి జాతీయస్థాయి అవార్డు

- రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణిస్తున్న విద్యార్థి సిద్ధార్థ
- చిన్నప్పటి నుంచి క్రీడలపై ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో ఉత్తమ అవార్డులు అందుకున్న విద్యార్థి సిద్ధార్థ
- తల్లిదండ్రుల ప్రోత్సాహమే విద్యార్థికి అండ



నవతెలంగాణ-మిరుదొడ్డి

బ్యాటు పట్టుకుని గ్రౌండ్‌లోకి దిగాడంటే ప్రతి క్రీడాకారుడి వెన్నుల్లో వణుకు పుట్టాల్సిందే. గాలి పీల్చుకుంటే షాట్ల పర్వం కురవాల్సిందే. బాల్ బ్యాడ్మింటన్ క్రీడల్లో రాణిస్తూ జాతీయస్థాయిలో మంచి గుర్తింపు సాధించడం ఎంతో గర్వంగా ఉంది విద్యతో పాటు క్రీడల్లో ప్రతి ఒక్కరూ ముందుండి గ్రామస్థాయి నుండి జాతీయ స్థాయి వరకు ఉత్తమ అవార్డులు తీసుకుంటూ మండలానికి మరింత పేరు తెచ్చిన విద్యార్థి సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన సరోజన బాలరాజు దంపతుల కుమారుడు సిద్ధార్థ. ఇతను మిరుదొడ్డి మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్లో 9వ తరగతి చదువుతున్నాడు. నాలుగో తరగతి నుండి బాల్ బ్యాలెట్ క్రీడపై ఆసక్తి





పెంచుకున్నాడు. మండలం.. జిల్లా.. రాష్ట్ర.. జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొంటున్నాడు. అనేకసార్లు జిల్లా స్థాయి రాష్ట్రస్థాయి పోటీల్లో అవార్డులు సాధించి మండలానికి మరింత పేరు ప్రఖ్యాతలు సంపాదించాడు. తెలంగాణ రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాకు సారథ్యం వహిస్తూ రాష్ట్ర స్థాయికి సిద్ధార్థ ఎంపికయ్యాడు. సబ్ జూనియర్ ఆర్డర్ 14 బాల్ బ్యాట్మెంటల్ ఛాంపియన్ షిప్ లో భాగంగా పలు రాష్ట్రాల్లో పోటీలు పాల్గొన్నాడు. 2018 బిహెచ్‌ఎల్ 2019 వరంగల్ జిల్లా కల్లూరు 2020లో ఖమ్మం జిల్లా ఉప్పల్ 2021లో ఖమ్మం జిల్లా భువననగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడారు. 2022 సబ్ జూనియర్ ఆర్డర్ 15 భవన్లో హైదరాబాద్ నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో జరిగిన బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్ 2023లో సత్తా చాటుకున్నాడు. అనంతరం సిద్ధార్థ జాతీయస్థాయిలో ఎంపికయ్యాడు. జాతీయస్థాయిలో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్లో జరిగిన రాష్ట్ర సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ ఛాంపియన్షిప్ టోర్నమెంట్ 2023లో ప్రతిభ చాటి జాతీయస్థాయి క్రీడలకు ఎంపికయ్యాడు. అదే ఏడాది ఫిబ్రవరి 16 నుండి 20 వరకు మంచిర్యాల జిల్లాలోని రాంపూర్‌లో జరిగిన 41వ జాతీయ బాల్ బ్యాట్మెంటల్ ఛాంపియన్షిప్లో రాష్ట్రస్థాయికి సారథ్యవహించాడు. ఆల్ ఇండియా బాల్ బ్యాడ్మింటన్ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందుకున్నాడు.

ఆదర్శంగా తీసుకోవాలి



ఉమ్మడి జిల్లా నుండి రాష్ట్రస్థాయి వరకు బాల్ బ్యాట్మెంటల్ క్రీడల్లో సిద్ధార్థ ఎన్నో గుర్తింపులు రావడం సంతోషకరంగా ఉంది. మా పాఠశాలకు మొట్టమొదటిసారిగా జాతీయస్థాయి అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉంది. జాతీయస్థాయిలో ఆదర్శ పాఠశాలను ఉత్తమంగా నిలపడంపై గర్వంగా ఉంది. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించడానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం అవసరం.

– భారతీదేవి. మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్

మరింత రాణిస్తా



చదువుతో పాటు క్రీడలో మరింత రాణించడానికి సిద్ధంగా ఉన్నా. గ్రామీణ ప్రాంతం నుంచి రాష్ట్ర జాతీయ స్థాయికి వెళ్లడం సంతోషంగా ఉంది. తల్లిదండ్రులు. గురువు సహాయంతో జాతీయ స్థాయికి వెళ్లాను.

– క్రీడాకారుడు సిద్ధార్థ

అగ్నివీర్ ఎంపికకు యువత ముందుకు రావాలి

- జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్



నవతెలంగాణ-సిద్దిపేట

ఎయిర్ ఫోర్సులో అగ్నివీర్ వాయుగా ఎంపికకు జిల్లా యువత ముందుకు రావాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ కోరారు. సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ వింగ్ కమాండర్ జె డబ్ల్యూ ఓ ఆనంద్ గోస్వామి, ఎస్ జి టి రాజేష్ లు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లేదా దానికి తత్సమాన విద్యార్హత గల విద్యార్థులు మ్యాథ్స్, ఫిజిక్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో 50 శాతం మార్కులు గలవారు, తత్సమాన డిప్లమా కోర్సు పూర్తి చేసినవారు, 02 జనవరి 02, 2004 జూలై 02, 2007 మధ్య జన్మించిన యువతీ యువకులు అగ్నివేర్ వాయు ఎంపికకు ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ 17 నుండి ఫిబ్రవరి 6 వరకు చేసుకోవాలన్నారు. ఆన్ లైన్ పరీక్ష మార్చ్ 17న నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా అగ్ని వీర్ వాయు కరపత్రాలను కలెక్టర్ ఆవిష్కరించారు. అంతకుముందు ఎయిర్ ఫోర్స్ కమాండర్ ఆనంద్ గోస్వామి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను సందర్శించి విద్యార్థులకు అగ్ని వీరి వాయుపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ప్రిన్సిపాల్ ప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, మహేందర్ రెడ్డి, సూర్యప్రకాష్, సిద్దిపేట జిల్లా యువజన మరియు క్రీడల అధికారి జె.నాగేందర్ పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



నవతెలంగాణ-కోహెడ

మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద స్వాతంత్య్ర సమరయోధుడు సుభాష్‌చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సేవసమితి అధ్యక్షుడు పిడిశెట్టి రాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారికంగా జయంతి వేడుకలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. అలాగే జనవరి 23 దేశ్ ప్రేమిదివాస్‌గా ప్రకటించి సెలవు రోజుగా ప్రకటించాలన్నారు. యువత చెడు వ్యసనాలకు భానిసకా కుండా ఇలాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మంద రాజయ్య, మాజీ ఉపసర్పంచ్ లక్ష్మణ్‌రావు, గుండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ సుతారి కనుకయ్య, జాక్ కన్వీనర్ మంద మల్లేష్, రామంచ ఆదిరెడ్డి, గూడూరు ఆంజనేయులు, కార్యదర్శి బి.దేవేందర్ రాథోడ్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్థం చేసుకొని చదవండి

- అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్



నవతెలంగాణ-సిద్దిపేట

పదో తరగతి విద్యార్థులు పాఠ్యాంశాలను బాగా అర్థం చేసుకుని చదవాలని, అప్పుడే ప్రతి ప్రశ్నకు సమాధానం రాయగలుగుతామని అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్ అన్నారు. రానున్న పదవ తరగతి పరీక్షలను దృష్టిలో ఉంచుకొని జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ బీసీ వసతి గృహాల పదవ తరగతి విద్యార్థులకు జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం బీసీ స్టడీ సర్కిల్‌లో మంగళవారం ప్రేరణ శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు మెలుకువలు, పకరీక్షలకు ఎలా సంసిద్ధం కావాలో తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఆల్‌ఇన్‌వన్, పరీక్ష సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి సరోజ, డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్. గోపాల్ సుదర్శన్, చేతిరాత నిపుణులు హజాజ్ అహ్మద్, సబ్జెక్టు కు సంబంధించిన అధ్యాపక బృందం అంజి రెడ్డి, సుధాకర్, చంద్రశేకర శర్మ, అరుణ, రవీందర్, నాగరాజు, వేణు మా ధవ్, బి.సి స్టడీ సర్కిల్ డైరెక్టర్ కృష్ణ దయాసాగర్, సహాయ వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మురళి పాల్గొన్నారు

క్యాట్ ఒలంపియాడ్ ఫలితాలలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రభంజనం



నవతెలంగాణ-సిద్దిపేట

రంగదాంపల్లి శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు జాతీయస్థాయిలో జరిగిన క్యాట్ నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్టులో సత్తా చాటారు. ఈ ఒలంపియాడ్ ఎగ్జామ్ రెండు దశలో జరుగుతుందని, మొదటి దశలో అర్హత సాధించిన వారు రెండో దశలో జరిగే పరీక్షకి అర్హత సాధిస్తారని, ఈ పరీక్షలో 90 మందికి విద్యార్థులు పైగా మంచి ఫలితాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ఏడో తరగతి చదువుతున్న అద్విత, రిషితారెడ్డి, అకిరానందన్, ఆరో తరగతి చదువుతున్న చక్రికా, కార్తీక్, నంద భువన్ రూ.వెయ్యి నగదు బహుమతి, బంగారు పతకం, మెరిట్ సర్టిఫికెట్లు గెలుపొందారని తెలిపారు. ఆరు, ఏడవ తరగతి చెందిన 24 మంది బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్స్, 62 మంది మెరిట్ సర్టిఫికెట్స్ పొందారని తెలిపారు. క్యాట్ ఫలితాలలో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల యజమాన్యం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈజీఎమ్ మధు, కోఆర్డినేటర్ నాయుడు, డీఎన్ రాజేంద్రప్రసాద్, సి ఇంచార్జ్ అశోక్, ఎస్ ఇంచార్జ్ హనుమాన్, ప్రైమరీ ఇంచార్జ్ మహాలక్ష్మి, అధ్యాపక బృందం బలరాం, శ్రీధర్, శ్రీనివాస్, పరశురాం , వాణి, స్రవంతి, బాలకృష్ణ, నరేష్, పద్మ , తేజశ్రీ పాల్గొన్నారు.

ప్రముఖులకు జాతర కమిటీ ఆహ్వానం



నవతెలంగాణ-బెజ్జంకి

ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించనున్న సమ్మక్క సారాలమ్మ జాతరకు ప్రముఖులను ఆహ్వానించినట్టు జాతర కమిటీ చైర్మన్ జంగిడి సంజీవ రెడ్డి తెలిపారు. మంగళవారం కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, మండల కేంద్రంలోని తహసిల్దార్ ఎర్రోల్ల శ్యామ్, ఎంపీడీఓ దమ్మని రాము, ఎస్ఐ నరేందర్ రెడ్డిని మంగళవారం జాతర కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువ కప్పి జాతరకు రావాలని ఆహ్వానించినట్టు తెలిపారు.

బీఓసీ కార్డు భవన నిర్మాణ కార్మికులకు మాత్రమే ఇవ్వాలి



నవతెలంగాణ-సిద్దిపేట: భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కార్మికులకు మాత్రమే బీఓసీ లేబర్ కార్డ్ ఇవ్వాలని జిల్లా బిల్డింగ్, ఇతర నిర్మాణాల కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి షేక్ గౌసొద్దిన్, కరుణాకర్ చారిలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం బిల్డింగ్ ఇతర నిర్మాణాల కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో ఏఎల్‌వోకు వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు లేబర్డ్ కార్డు దరఖాస్తు చేసుకునే విషయంలో, సంక్షేమ పథకాలు దరఖాస్తు చేసుకునే విషయంలో వేలి ముద్రలు తీసివేయాలన్నారు. కార్మికులు దరఖాస్తు చేసుకున్న డబ్బులు డిపాజిట్ కాగానే రిలీజ్ చేయాలని, సంక్షేమ పథకాలు భవన నిర్మాణ కార్మికులకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బీఓసీ లేబర్ కార్డ్ ఆన్లైన్లో ఫ్యామిలీ డిటేల్స్ కనిపించే విధంగా చూడాలని, ఆధార్ కార్డు అనుసంధానం జరిగే విధంగా చూడాలన్నారు. సిద్దిపేట జిల్లా కార్మిక శాఖలో ఉద్యోగస్తులను పెంచే విధంగా చూడాలని కోరారు. జిల్లా నోడల్ అధికారి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు రమేష్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఈఎస్ఎంఎస్ యాప్‌పై అవగాహన



నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం ఈఎస్ఎంఎస్ (ఎలక్షన్ సీజర్ మేనేజ్ మెంట్ సిస్టం యాప్‌పై కేంద్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వివరించారు. గూగుల్ ప్లే స్టోర్ నుంచి ఈఎస్ఎంఎస్ యాప్ డౌన్లోడ్, లాగిన్ అయ్యే విధానం తెలిపారు. ఎన్నికల సందర్భంగా డబ్బు, మద్యం ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే సామగ్రిని పట్టుకోవాలని అన్నారు. ఈఎస్ఎంఎస్ యాప్‌లో అప్లోడ్ చేసే విధానం, వాహనాలను తనిఖీ చేసే పద్ధతిపై జిల్లాలోని ఫ్లయింగ్ స్క్వాడ్, సర్విలెన్స్ స్టాటిస్టికల్ టీమ్(ఎఫ్ఎస్/ ఎస్ఎస్ టీ) అధికారులకు తెలిపారు. అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం అధికారులకు పలు ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జే పాటిల్, అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, సిద్దిపేట, హుస్నాబాద్ ఆర్డీఓ రమేష్ బాబు, బెన్ షాలం, ఎలక్షన్ సూపరింటెండెంట్ రామేశ్వర్, ఎలక్షన్ డిటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు



నవతెలంగాణ-జగదేవపూర్

భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని యువకులు గుర్తు చేసుకున్నారు. మంగళవారం నాడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలు మండల కేంద్రంలో గల అంబేద్కర్ చౌరస్తాలో భగత్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేశారు. స్వాతంత్రం కోసం పోరాడిన విషయాలను స్మరించుకుంటూ ఆయనకు నివాళులు అర్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆరెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బుద్ధ నాగరాజు , పీర్లపల్లి సర్పంచ్ యాదవ రెడ్డి , మాజీ కొండపోచమ్మ డైరెక్టర్ దాచారం కనకయ్య, వార్డు మెంబర్లు సదల కర్ణాకర్,పతిమా అలీమ్,నాయకులు దండే వెంకటేష్, ఉప్పల్, ఈశ్వర్, అస్మత్ , శివాజీ యూత్ సభ్యులు శ్రీకాంత్ ,నాగరాజ్ , బాలకృష్ణ పాల్గొన్నారు.

బాలవ్వ కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ-మిరు దొడ్డి

మిరుదొడ్డి అక్బరుపేట, భూంపల్లి మండలంలోని భూంపల్లి గ్రామంలో అనారోగ్యంతో చనిపోయిన బొల్లు బాలవ్వ మరణం బాధాకరమని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయాన్ని అందించారు. బీఆర్ఎస్ నాయకులు బోయ శ్రీనివాస్ వార్డు సభ్యులు దోమకొండ నర్సింహులు గ్రామ కమిటీ అధ్యక్షుడు అయితం శ్రీనివాస్ నిల నర్సింహులు తదితరులు ఉన్నారు.

పట్టణ ప్రముఖుడు సురేందర్ రావు మృతి

నవతెలంగాణ-చేర్యాల

చేర్యాల పట్టణ ప్రముఖుడు, వివిధ ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణం కోసం తన భూమిని విరాళంగా ఇచ్చిన కల్వకోట సురేందర్‌రావు (79) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం గౌడ్, చేర్యాల మున్సిపల్ చైర్ పర్సన్ అంకుగారి స్వరూప, సీపీఐ(ఎం)సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, మద్దూరు ఎంపీపీ బద్దిపడగ కృష్ణారెడ్డి, సిహెచ్. కృష్ణాజి రావు ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఆయన మృతికి సంతాపం తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

నేడు తొగుటలో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటన



నవతెలంగాణ-తొగుట

మండల కేంద్రమైన తొగుటలో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పర్యటించనున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షులు జీడిపల్లి రాంరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర మంత్రితో కలిసి మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ, వాటర్ ట్యాంక్, పాఠశాల డైనింగ్ హాల్, కస్తూర్బా నూతన పాఠశాల భవనం, రైతు వేదికలను ప్రారంభిస్తారని ఆయన తెలిపారు. అనంతరం మల్లన్న సాగర్ నుండి దుబ్బాక కాలువ కు సాగునీరు విడుదల చేయనున్నరని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ గ్రామ, బూత్, యూత్, విద్యార్థి, సోషల్ మీడియా ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, ప్రతినిధులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

బీఎస్పీ నియోజకవర్గం అధ్యక్షుడిగా కానుగుల రమణాకర్



నవతెలంగాణ- గజ్వేల్

బహుజన్ సమాజ్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ సమీక్ష సమావేశం మంగళవారం నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలకు సన్నదం అవ్వాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈశ్వర్ రాష్ట్ర కార్యదర్శి లింగంపల్లి యాదగిరి దిశా నిర్దేశం చేశారు. గజ్వేల్ నియోజకవర్గ నూతన అధ్యక్షులుగా రమణాకర్‌ను ఈఆర్ మోహన్ నియమించారు. కార్యక్రమంలో జిల్లా ఇంచార్జి రోమాల బాబు ,జిల్లా ఉపాధ్యక్షులు కటికల ఓం ప్రకాష్ ,నియోజకవర్గ ఇంచార్జిలు కొండనోళ్ళ నరేష్, కెతోజి వినోద్ చారి , మాజీ అధ్యక్షులు మొండి కర్ణాకర్, ఉపాధ్యక్షులు గుర్రం ఎల్లం, మెంబెర్ కనకప్రసాద్, నవీన్, మండల నాయకులు కర్ణాకర్, చంద్రం, వంశి, ప్రసాద్ సిద్దిపేట నాయకులు ఉమేష్, అశోక్ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్

నవ తెలంగాణ - సిద్దిపేట

స్వచ్ఛభారత్‌కు ప్రతిరూపమైన పారిశుధ్య కార్మికులను వెంటనే పర్మినెంట్ చేసి, స్వచ్ఛభారత్ కు బ్రాండ్ అంబాసిడర్లుగా పారిశుధ్య కార్మికులనే ప్రకటించాలని ఎమ్మార్పీఎస్‌టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు, జిల్లా ఇంఛార్జి దప్పు శివరాజ్ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా గ్రామాలలో, పట్టణాలలో దళితులు పారిశుధ్య కార్మికులుగా, మాన్యువల్ స్కావెంజర్లుగా, డ్రైనేజీలను శుభ్రం చేసేవారుగా, చెత్తను సేకరించేవారుగా, రోడ్లు ఊడ్చేవారుగా పనిచేస్తున్నారని, వీరిని స్వచ్ఛభారత్ ప్రతిరూపమైన పరిశుద్ధ కార్మికులను పర్మినెంట్ చేయకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని అన్నారు.

ప్రధాని నరేంద్ర మోడీ పారిశుద్ధ కార్మికులను ఉద్దేశించి ఘనంగా మాట్లాడుతాడని, వారిని సన్మానిస్తాడు కానీ వారికి కనీసం ఉద్యోగ భద్రత కల్పించాలనే స్పృహ లేకపోవడం బాధాకరం అని అన్నారు. పారిశుద్ధ కార్మికుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించకుండా, వారికి ఆధునిక పరికరాలు ఇచ్చి, వారి ఆరోగ్యానికి కాపాడుతూ, వెంటనే పరిమినెంట్ చేసి, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఫిబ్రవరి 29న హైదరాబాదులోని ఇందిరా పార్క్ లో నిర్వహించ తలపెట్టిన పోరుగర్జన కార్యక్రమంలో



మాదిగ, మాదిగ ఉపకులాల నాయకులు, పారిశుధ్య కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి కాశపాక రాజేందర్ మాదిగ, సిద్దిపేట జిల్లా అధ్యక్షులు భూమిగారి రాజేందర్ మాదిగ, రాష్ట్ర సీనియర్ నాయకులు పొన్నాల కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం వెంకటేష్ మాదిగ , సిద్దిపేట నియోజకవర్గ ఇన్చార్జ్ రాజేందర్ మాదిగ, దుబ్బాక నియోజకవర్గం ఇంచార్జ్ కృష్ణ మాదిగ, కార్యదర్శి కట్కూరి పరుశురాములు, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



నవతెలంగాణ జగదేవపూర్

జగదేవ్‌పూర్ మండలంలోని ఇటిక్యాల, దౌలాపూర్ గ్రామాల్లో వారం రోజుల క్రితం కుటుంబ సమస్యలతో ఆత్మహత్య చేసుకున్న వారి కుటుంబాలకు మంగళవారం మండల రజక సంఘం నాయకులు ఆర్థిక సహాయం అందజేశారు. ఇటిక్యాల, దౌలాపూర్ గ్రామాల్లో మృతి చెందిన రాచకొండ మల్లేశం, పోతరాజు సత్యనారాయణ కుటుంబాలను పరామర్శించి రూ.5 వేల చొప్పున ఇరు కుటుంబాలకు రూ.10 వేలు అందజేశారు. రజక సంఘం మండల గౌరవాధ్యక్షుడు అక్కారం నర్సింలు, ఉపాధ్యక్షులు వడ్లకొండ శ్రీనివాస్ ,ఎడపల్లి వెంకటయ్య, దౌలాపూర్ ఉపసర్పంచ్ జూపల్లి భాస్కర్, కోశాధికారి రాచకొండ బాల్ నర్సయ్య, నాయకులు జూపల్లి మధు, అనుమాండ్ల కొండల్, జూపల్లి మహేందర్, బంగారి భాస్కర్, చిన్న మహేందర్ ,బయ్యారం భాస్కర్ ,రాచమల్ల కిష్టయ్య, రాచకొండ లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

పది పైసలతో సుభాష్ చంద్రబోస్ చిత్రం



నవ తెలంగాణ -గజ్వేల్

భారత ముద్దుబిడ్డ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా చిన్న పది పైసల (1988నాటి) నాణాలను ఉపయోగించి శుభాష్‌చంద్రబోస్ చిత్రాన్ని చిత్రించి మంగళవారం రామకోటి కార్యాలయంలో ఆవిష్కరించి నివాళులర్పించారు. గజ్వేల్ పట్టణానికి చెందిన శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక, అధ్యక్షులు, రాష్ట్రస్థాయి కళారత్న అవార్డ్ గ్రహీత రామకోటి రామరాజు చిత్రీకరించారు.

కస్తూర్బాలో పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-వర్గల్

మండలకేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో స్వీపర్ పోస్ట్ ఖాళీగా ఉన్నట్లు స్పెషల్ ఆఫీసర్ రజిత తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడో తరగతి లేదా పదోతరగతి ఉత్తీర్ణులైన వారు ఈ నెల 31వ తేదీ వరకు వర్గల్ కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులైనవారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని అన్నారు.

ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-రాయపోల్

చేసిన అప్పుల బాధతో మద్యానికి బానిసై తీవ్ర మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రాయపోల్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకుంది. రాయపోల్ పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. రాయపోల్ మండల కేంద్రానికి చెందిన అరికెల కనకయ్య (40) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. వ్యవసాయం చేయడానికి అప్పులు చేసి, మూడు సంవత్సరాల క్రితం బతుకుదెరువు కోసం దుబాయ్ వలస వెళ్లాడు. తిరిగి వచ్చిన తర్వాత తనకున్న వ్యవసాయ పొలంలో వ్యవసాయం పొలంలో బోర్లు వేశాడు. బోర్లు వేసిన అప్పులు, వ్యవసాయ పెట్టుబడుల కోసం చేసిన అప్పులు అధికమవడంతో అప్పులు తీర్చే మార్గం కనబడక ఇటీవల కాలంలో మద్యానికి బానిస అయ్యాడు. అప్పులు ఎలా తీర్చాలని మదనపడుతుండేవాడు. సోమవారం ఉదయం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లాడు. ఆయన భార్య సులోచన ఉదయం 10:00 గంటలకు కూలి పనికి వెళ్ళిపోయింది. ఆ తర్వాత ఇంటికి వచ్చిన కనకయ్య ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కూలి పనికి వెళ్ళిన భార్య సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చి ఇంటి లోపలికి వెళ్లేసరికి ఇంట్లో దూలానికి కనకయ్య ఉరివేసుకొని వేలాడుతున్నాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి చూసేసరికి కనకయ్య మృతి చెందాడు. పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య సులోచన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రాయపోల్ ఎస్సై రఘుపతి తెలిపారు.



ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు దాసరి ప్రశాంత్

నవ తెలంగాణ సిద్దిపేట కలెక్టరేట్

భక్తి పేరుతో విద్యార్థుల విద్యకు వారంరోజుల పాటు సంకెళ్ళు వేయడం హేయనీయమైన చర్య అని భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు, మరియు కార్యదర్శి అరవింద్ దాసరి ప్రశాంత్ లు అన్నారు. మంగళవారం సిద్దిపేట జిల్లా ఎస్ఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో జిల్లా ఏడి వెంకటేశ్వర రెడ్డి సూపరిటెండెంట్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం ఇచ్చారు ఈ సందర్భంగా అరవింద్ దాసరి ప్రశాంత్ లు మాట్లాడుతూ సోమవారం అయోధ్యలో జరిగిన రామాలయం ఓపెన్ కార్యక్రమంలో సందర్భంగా సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో రామాయణంకు సంబంధించిన నాటికలు ప్రదర్శనలు ర్యాలీలు పూజలు పాఠశాలలో నిర్వహించడం జరిగింది. పాఠశాలలో అన్ని కులాల అన్ని మతాల విద్యార్థులు చదువుకుంటారు వాళ్లందరి గౌరవించాలి ఒక మతాన్ని పూజలు పురస్కారం చేయడం ద్వారా విద్యార్థులను తప్పుదారి పట్టించినట్లుగా అవుతుందని అన్నారు. మనది సెక్యులర్ దేశం అన్నవిషయాన్ని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు తెలువదాని అన్నారు అన్ని కులాలు మతాల వారిని గౌరవించే మనదేశమని గుర్తుచేశారు గత వారం రోజులుగా ప్రభుత్వ ఉపాధ్యాయులు పాఠాలు మరిచి భక్తిలో విద్యార్థుల్ని లీనం చేయడం విడ్డురామని అన్నారు. జరిగింది అదేవిధంగా. గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం మజీద్ పల్లి బుర్రగూడెం ప్రాథమిక పాఠశాలలో రాముని వేషంలో విద్యార్థుల్ని ప్రదర్శనలు నాటికలు. ములుగు మండలం కేంద్రంలో వివేకానంద పాఠశాలలో ప్రతి విద్యార్థి రాముని గురించి ఉపన్యాస పోటీలు పెట్టడం జరిగింది అలాగే జిల్లా కేంద్రంలో పలు ప్రవేటు పాఠశాలలో రాముడు వేషంలో పాఠశాల సమయాల్లో తరగతులు



నిర్వహించకుండాభక్తి కార్యక్రమాన్ని నిర్వహించిన అధికారులు ఉన్నారు.జిల్లా విద్య శాఖ అధికారులకు తెలిసికూడా పట్టించుకోకపోవడం విడ్డురమని ఎద్దేవాచేశారు. బాధ్యులైన ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాల ఉపాధ్యాయు పైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పవన్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.